

# నేటి నిజం

తెలుగు దినపత్రిక




website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 29-9-2020 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:48 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# మూగజీవాలకు మెరుగైన వైద్యం

## రేబిస్ డే సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించిన తలసాని

హైదరాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): రాష్ట్రం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మూగ జీవాలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రపంచ రేబిస్ డే సందర్భంగా మాసాబ్‌ట్యాంక్‌లోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో వీధి శునకాలకు ఉచితంగా టీకాల పంపిణీ పోస్టర్‌ను ఆ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. జంతు సంరక్షణకు స్వచ్ఛందంగా ముందుకొచ్చే సంస్థలకు ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామన్నారు. రాష్ట్ర ఎనిమల్ బోర్డు ఆధ్వర్యంలో మూగజీవాల సంరక్షణకు అనేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. త్వరలోనే జిల్లా ఎనిమల్ బోర్డు కమిటీల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని గోశాలలోని జీవాలకు 1962 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సేవలు అందుతున్నాయని చెప్పారు. సంచార పశు వైద్యశాలలు జీవాల వద్దకే వెళ్లి సేవలందిస్తున్నాయని ఉద్ఘాటించారు. లాక్‌డౌన్ సమయంలో వీధి శునకాలకు ఆహారం అందించిన సంస్థల నిర్వాహకులను మంత్రి తలసాని అభినందించారు.



# పుల్వామా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. అవంతిపొరా ప్రాంతంలోని సాంబూరాలో ఉగ్రవాదులు ఉన్నారని అందిన సమాచారం మేరకు భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చేపట్టాయి. భద్రతాబలగాల రాకను గమనించిన ఉగ్రవాదులు కాల్పులు జరిపారని ఓ పోలీస్ అధికారి చెప్పారు. భద్రతాబలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారని, వారు ఏ గ్రూప్‌కు చెందిన వారన్న సంగతి ఇంకా తెలియరాలేదన్నారు.

# సివిల్స్ ప్రిలిమ్స్ వాయిదా కుదరదు

## సుప్రీంకు తేల్చి చెప్పిన యూపిపిఎస్సీ
## నివేదిక ఇవ్వాలని సూచించిన ధర్మాసనం
## విచారణ బుధవారానికి వాయిదా

న్యూఢిల్లీ,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): వచ్చే నెల 4న జరగాల్సిన సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షను వాయిదావేసే అవకాశం లేదని సుప్రీంకోర్టుకు యూపీఎస్సీ తెలిపింది. కరోనా నేపథ్యంలో సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షను వాయిదావేయాలని దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు సోమవారం విచారణ చేప్టింది. ఈసందర్భంగా పరీక్షను వాయిదావేయడం సాధ్యంకాదని యూపీఎస్సీ తరపు న్యాయవాది అత్యున్నతన్యాయస్థానానికి తెలిపారు. అయితే వాయిదా వేయలేకపోవడానికి కారణాలు తెలపాలని, దానికి సంబంధించి మంగళవారం అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్ ఖాన్విల్కర్ నేతృత్వంలోని ధర్మాసనం యూపీఎస్సీని ఆదేశించింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదవేసింది. షెడ్యూల్ ప్రకారం యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష అక్టోబర్ 4న జరగాల్సి ఉన్నది. అయితే దేశంలో కరోనా కేసులు పెరుగుతుండటం, వివిధ రాష్ట్రాల్లో వరదల నేపథ్యంలో పరీక్షను రెండు నుంచి మూడు నెలలపాటు వాయిదా వేయాలని 20 మంది అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, కరోనా మహమ్మారిని నిలువరిం చడానికి దేశంలో లాక్‌డౌన్ విధించడంతో మే 31న జరగాల్సిన ప్రిలిమ్స్ పరీక్ష వాయిదాపడింది. అనంతరం జూన్ 6న పరీక్షల తేదీలను ప్రకటించింది. అక్టోబర్ 4న ప్రిలిమ్స్ జరుగుతుందని వెల్లడించింది. పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు ఇప్పటికే విడుదలయ్యాయి.



దివంగత నటుడు పైడి జయరాజ్ 111వ జయింతి సందర్భంగా రవీంద్రభారతిలో ఆన చిత్రం పటం వద్ద నివాళి అర్పించిన మంత్రి శ్రీనివాస గౌడ్ తదితరులు

# లక్ష్యం మేరకు మిషన్ భగీరథ పూర్తి కావాలి

## -సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి ఆదేశాలు

హైదరాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీటిని అందించడమే లక్ష్యంగా పని చేయాలని పంచాయతీరాజ్ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి మంచినీరు అందించాలన్న లక్ష్యంతో సిఎం కెసిఆర్ భగీరథ పకాన్ని చేపట్టారని అన్నారు. దీనిని సకాలంలో పూర్తి చేసి లక్ష్యాన్ని సాధించాలన్నారు. మిషన్ భగీరథ పనులు, పలు అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ..అన్ని ఊర్లకు ప్రతి రోజూ నీటి సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా స్టెబిలైజేషన్ ను చేస్తున్నామని తెలిపారు. స్టెబిలైజేషన్ పక్రియను మరింత వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా ప్రతి గ్రామానికి భగీరథ నీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని ఏ ఒక్క ఇంటిని వదిలి పెట్టకుండా ప్రతి ఇంటికి నల్లాను బిగించాలని సూచించారు. గ్రామంలోని వైకుంఠ ధామాలు, డబుల్ బెడ్ రూమ్ కాలనీలకు నీటి కనెక్షన్ ఇవ్వాలన్నారు. స్టెబిలైజేషన్ లో వెనుకబడ్డ జిల్లాల చీఫ్ ఇంజినీర్లు ఇంకా ఎక్కువ ఫోకస్ పెట్టి పని చేయాలని ఆదేశించారు.

# భగతస్‌సింగ్‌కు అమిత్ షా నివాళి

న్యూఢిల్లీ,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): భగత్‌సింగ్ భారతీయులందరికీ స్ఫూర్తి అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. సోమవారం భగత్ సింగ్ 113వ జయంత్రి సందర్భంగా ఆయన నివాళులర్పించారు. 'భగత్‌సింగ్ తన విప్లవాత్మక ఆలోచనలతో స్వాతంత్ర్య ఉద్యమానికి కొత్తమార్గం చూపారు. దేశం కోసం ప్రాణాన్ని త్యాగం చేసి యువతలో స్ఫూర్తి నింపిన గొప్ప వీరుడు. ఆయన స్ఫూర్తిని భారత జాతి నిరంతరం గుర్తు చేసుకుంటుందని' అని ట్విట్టర్‌లో అమిత్ షా పేర్కొన్నారు. 1907లో ఫైసలాబాద్ జిల్లాలోని బంగా గ్రామం.. ప్రస్తుతం పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లోగల ల్యాల్‌పూర్‌లో భగత్‌సింగ్ జన్మించారు. స్వాతంత్ర్య ఉద్యోమంలో బ్రిటిషర్లకు వ్యతిరేకంగా ఉద్యమించి 23 ఏండ్ల వయస్సులోనే ఉరితీయబడ్డాడు. భగత్ సింగ్‌ను 1931 మార్చి 23న లాహోర్ జైలులో ఉరితీశారు.

# కరోనా రోగులకు సిద్ధిపేటలో ఉచిత వైద్యం

## -లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభించిన మంత్రి హరీష్ రావు

సిద్ధిపేట,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): కరోనా లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే సిద్ధిపేట కొవిడ్ దవాఖానకు రావాలని,ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు వైద్య బృందం సిద్ధంగా ఉందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు చెప్పారు. రాష్ట్రంలో కరోనా నుంచి కోలుకుంటున్న సక్సెస్ రేట్ 99.4 శాతం చాలా ఎక్కువగా ఉందని, 0.6 శాతం మాత్రమే మృత్యువాత పడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకును సోమవారం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ తమిళ్ అరసుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కరోనా నేపథ్యంలో ఆక్సిజన్ అవసరాలు పెరిగాయి. హైదరాబాద్ నుంచి సిద్ధిపేటకు రావాలంటే.. వైద్య సిబ్బంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని గమనించి శాశ్వత ప్రాతిపదికన సిద్దిపేట మెడికల్ కళాశాలకు లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకును తెప్పించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 405 బెడ్స్ కోసం పని చేసేలా రూ.61 లక్షల వ్యయంతో లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకును తెప్పించినట్లు మంత్రి తెలిపారు. ప్రజలు అనవసరంగా ప్రైవేట్ దవాఖానకు పోయి డబ్బులు వృథా చేసుకోవద్దని మంత్రి కోరారు. సిద్ధిపేటలో వంద పడకల కొవిడ్ దవాఖాన, మంచి డాక్టర్లు ఉన్నారు. అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి.

క్సిజన్ సప్లయ్ సమస్య ఇవాల్టితో శాశ్వతంగా పరిష్కారమైందని తెలిపారు. పాజిటివ్ వచ్చిన వారికి వైద్య బృందం టచ్‌లో ఉండి అవసరమైన ట్రీట్మెంట్ అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలని మంత్రి ప్రజలను కోరారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాల సాయిరాం, సుడా డైరెక్టర్ మచ్చ వేణుగోపాల్ రెడ్డి, దవాఖాన సూపరింటెండెంట్ చంద్రయ్య, మెడికల్ కళాశాల ఆర్ఎంవో కాశీనాథ్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హేమంత్‌ది పక్కగా పరువు హత్యే

## నిగ్గుతేల్చి పోలీసులు
## హత్యకేసులో మరికొందరి అరెస్ట్

హైదరాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): హేమంత్ కుమార్ హత్య కేసును పోలీసులు పరువు హత్యగా తేల్చారు. హేమంత్‌ను పక్కా ప్రణాళికతో పరువు కోసమే హత్య చేశారని గచ్చిబౌలి పోలీసులు సోమవారం వెల్లడించారు. తమ కూతురు కులాంతర వివాహం చేసుకున్నందుకే లోకల్ గ్యాంగ్‌తో కలిసి హత్య చేయించినట్లు తండ్రి లక్ష్మారెడ్డి, మామ యుగంధర్ పోలీసులు ముందు నిజం ఒప్పుకున్నారు. అవంతి-హేమంత్ ప్రేమ వివాహం గురించి తెలిసిన లక్ష్మారెడ్డి ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు పెట్టించాడని పోలీసులు తెలిపారు. ఆరు నెలల పాటు అవంతిని బయటకు వెళ్లకుండా తండ్రి తీవ్రంగా కట్టడిచేశాడని వెల్లడించారు. దీంతో జూన్ 10న కరెంట్ పోయిన సమయంలో అవంత ఇంట్లో నుంచి పారిపోయి హేమంత్‌ను కలిసిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు హేమంత్ హత్య కేసులో మొత్తం 22 మంది నిందితులు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను ఐదు రోజుల పాటు కస్టడి కోరుతూ ఎల్బీనగర్ కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. సంఘటన స్థలానికి సంబంధించి జహీరాబాద్‌లో ఓఆర్ఆర్ మీద సీసీ కెమెరా దృశ్యాలను సేకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను కస్టడిలోకి తీసుకొని సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు అవంతి, హేమంత్ కుటుంబసభ్యులు సీపీ సజ్జనార్‌ను కలవనున్నారు. రాష్ట్రంలో ఈ నెల 25న చోటు చేసుకున్న హేమంత్ హత్య రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పటికే పలువుర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు కీలక విషయాలను రాబట్టారు. హేమంత్ కేసులో ఇప్పటికే 18 మంది పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించగా.. తాజాగా మొత్తం 25 మంది ప్రమేయం ఉన్నట్లు పోలీసులు నిగ్గుతేల్చారు.

# తెలంగాణలో తగిన కరోనా తీవ్రత

## -మరో ఏడుగురు మాత్రమే మృతి

హైదరాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా వైరస్ మహమ్మారి ఉధృతి కాస్త తగ్గింది. గడిచిన 24 గంటల వ్యవధిలో కొత్తగా 1,378 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వైరస్ బారినపడిన వారిలో 1,932 మంది కోలుకొని డిశ్చార్జి కాగా ఏడుగురు మృత్యువాతపడ్డారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 1,87,211 మంది కోవిడ్-19 వైరస్ బారినపడగా 1,56,431 మంది చికిత్సకు కోలుకున్నారు. తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ల కారణంగా 1107 మంది మృతి చెందారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం 29,673 మంది వివిధ దవాఖానల్లో చికిత్స పొందుతుండగా హోం ఐసోలేషన్‌లో 24,054 మంది ఉన్నారు.

# తెలంగాణ గర్వించదగ్గ నటుడు పైడి జయరాజ్

## -జయంతి వేడుకల్లో మంత్రి శ్రీనివాస గౌడ్

హైదరాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): తెలంగాణ గర్వించదగ్గ నటుడు, దాదాసాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత, బాలీవుడ్ మొట్ట మొదటి సూపర్ స్టార్ పైడి జయరాజ్ అని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు చెందిన కవులు, కళాకారులు, సాహితీవేత్తలను విస్మరించారని అన్నారు. కరీంనగర్ ముద్దుబిడ్డ దివంగత ప్రముఖ నటుడు పైడి జయరాజ్ 111వ జయంతి వేడుకలు రవీంద్రభారతిలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మంత్రులు శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పైడి జయరాజ్ చిత్రపటానికి మంత్రులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. దేశం గర్వించదగిన నటుడు పైడి జయరాజ్ జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణకు చెందిన కవులు, కళాకారులతో పాటు ప్రముఖులను గుర్తించి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ తరపున వారి జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు వారి కుటుంబ సభ్యులను పిలిచి గౌరవిస్తున్నామని చెప్పారు. రవీంద్ర భారతిలోని ప్రివ్యూ థియేటర్‌కు పైడి జయరాజ్ పేరు పెట్టి గౌరవిస్తున్నామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

# వ్యవసాయ బిల్లులపై కాంగ్రెస్ విమర్శలు

## దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఆందోళనలు
## ఢిల్లీలో ఇండియా గేట్ వద్ద రైతుల నిరసనలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన మూడు వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా ఉత్తర భారతదేశంలో కాంగ్రెస్ పిలుపు మేరకు నిరసనలు, ఆందోళనలు కొనసాగాయి. అలాగే పలు రైతు సంఘాలు కూడా ఆందోళన చేపట్టాయి. ఢిల్లీ సహా పంజాబ్, హర్యానాతో పాటు రాజస్తాన్, ఉత్తర ప్రదేశ్‌లోనూ రైతులు ఆందోళనలు నిర్వహించారు. కర్నాటకలో రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగి బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో వ్యాపార వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. రోడ్డుమీదకు వ్చి మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనల సెగ దేశ రాజధాని ఢిల్లీని తాకింది.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఇండియా గేట్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యవసాయ బిల్లులను నిరసిస్తూ ఓ ట్రాక్టర్ ను, ప్రధాని మోడి దిష్టి బొమ్మను సైతం దగ్ధం చేసారు. పంజాబ్ ముద్దబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి నాడు పంజాబ్ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతుల నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా పంజాబ్‌లో రైతుల ఆందోళనలు కొనసాగాయి. అమృత్‌సర్-ఢిల్లీ మార్గంలో రైలు పట్టాలపై కూర్చుని నిరసనలు చేపట్టారు. వ్యవసా బిల్లులలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇప్పటికే ఆమోదం ముద్ర కూడా వేశారు. వ్యవసాయ రంగం, రైతుల పాలిట క్యాన్సర్‌లా మారిన వ్యవసాయ బిల్లులను వ్యతిరేకించాలని ఎన్.డి.ఏ భాగస్వామ్య పక్షాలకు కాంగ్రెస్ లేఖ రాసింది. ఆందోళన చేస్తున్న రైతులకు మద్దతుగా ఎన్.డి.ఏని వీడి బయటకు రావాలని జేడీయూ, ఎల్‌జేపీ, జేజేడి పార్టీలను కోరుతూ ఆ పార్టీలకు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ లేఖ రాసింది. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పంజాబ్ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్ ధర్నాలో పాల్గొన్నారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఖాట్కర్ కలాన్‌లోని షాహీద్ భగత్ సింగ్ నగర్‌లోని విగ్రహానికి సోమవారం ఉదయం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ధర్నా శిబిరంలో కూర్చొని నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వ్యవసాయ బిల్లులను తమ రాష్ట్రంలో అమలు చేయబోమని చెప్పారు. న్యాయ, వ్యవసాయ నిపుణులను సంప్రదించి రాష్ట్ర రైతు చట్టాలను ఆ మేరకు సవరణ చేస్తామని అన్నారు.మరోవైపు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పంజాబ్‌లో జరుగుతున్న రైతుల నిరసనలో పాల్గొంటారని సమాచారం. అనంతరం ఆయన హర్యానాకు వెళ్లి అక్కడి రైతులతో కలిసి నిరసన తెలుపుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా రెండు నెలలపాటు ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ ఇటీవల పిలుపునిచ్చింది. అలాగే ఈ బిల్లులకు వ్యతిరేకంగా రైతుల నుంచి సంతకాలు సేకరిస్తున్నది.

## చరిత్రలో నేటినిజం



కం॥ పదవులకు వన్నె తెచ్చెడి
విదుడై క్రికెట్టు బోర్డు ప్రెసిడెంటుగ, స
మ్మదమును యందరి కొసగిన
సదమల యశమును గాంచెను "శశాంక మనోహర్"!!



-రాధశ్రీ
సెల్: 9494481210

( సెప్టెంబర్ 29 శశాంత్ మనోహర్ జననం..)

# మరోమారు నగరంలో వర్షం

హైదరాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో మళ్లీ వర్షం కురిసింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సహాయక బృందాలు చర్యలు చేపట్టాయి. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత వారంలో నాలుగైదు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు నగరం ఇప్పటికే అతలాకుతలమైంది. శనివారం రాత్రి వరకు వాన దంచికొట్టింది. ఆదివారం వాన లేకపోయినప్పటికీ చల్లని గాలులు వీచాయి. అక్కడక్కడ కాస్త ఎండ కనిపించింది. ఈ నెల 28న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిన విషయం విదితమే. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమై ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

# హౌజింగ్ బోర్డు ఆస్తులపై వివరాలు ఇవ్వండి

## -అధికారులకు మంత్రి ప్రశాంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని హౌసింగ్ బోర్డ్ ఆస్తులపై వారంలోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని మంత్రి ప్రశాంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన భూములు, ఎ÷-లాట్లు, భవనాలు, వాణిజ్య స్థలాల పూర్తి వివరాలు ఇవ్వాలని సూచించారు. గృహనిర్మాణ సంస్థ ఆస్తులపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ బోర్డు ఆస్తులను అనుభవిస్తున్నవారి వివరాలు సవివరంగా అందించాలన్నారు. నిరర్ధకమైన, వినియోగంలో ఉన్న ఆస్తుల వివరాలను ఇవ్వాలని చెప్పారు. ఆస్తులపై ఉన్న కోర్టు కేసులను త్వరితగతిన తేల్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్ బోర్డ్ ఆస్తుల ద్వారా ఆదాయం పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నిరర్ధక ఆస్తులపై సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

# దుర్గం చెరువుపై వాహనాలకు అనుమతి

## -సిసి కెమరాల ద్వారా వేగం పరిశీలన

హైదరాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): నగరంలో దుర్గం చెరవు వంతెన వాహనదారులకు అందుబాటులోకి వచ్చింది. దుర్గం చెరువుపై అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మంచిన తీగల వంతెనపై వాహనాల రాకపోకలకు అధికారులు అనుమతించారు. అయితే బ్రిడ్జిపై 40 కి.మీ. కంటే వేగంగా వాహనాలు నడపకూడదని ట్రాఫిక్ పోలీసులు సూచికలు ఏర్పాటు చేశారు. బ్రిడ్జిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను పరిశీలిస్తున్నారు. వంతెనపై పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలకు చలానా విధిస్తున్నారు. పెద్ద గూడ్స్ వాహనాలను వంతెనపైకి అనుమతించడం లేదు. కాగా, ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన కేబుల్ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో సంతోషిస్తున్న నగరవాసులు వంతెనపై వాహనాలు ఆపి ఫొటోలు దిగుతున్నారు. చారిత్రక హైదరాబాద్ నగరానికి మరింత అందం చేకూర్చేలా దుర్గం చెరువుపై అత్యాధునిక పరిజ్ఞానంతో కేబుల్ బ్రిడ్జిని రాష్ట్రప్రభుత్వం నిర్మించింది. రూ.184 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ తీగల వంతెనను మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సెప్టెంబర్ 25న ప్రారంభిం చారు. 735.639 మీటర్ల పొడవు, 18 మీటర్ల వెడల్పుతో నాలుగు లేన్లతో నిర్మించిన ఈ వంతెనతో జూబ్లీహిల్స్, ÷నాన్షియల్ డిస్ట్రిక్ట్ మధ్య దూరంతోపాటు, ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. దీంతోపాటు దుర్గం చెరువులో బోటింగ్‌ను, కేబుల్ బ్రిడ్జికి అనుసంధానంగా జూబ్లీహిల్స్ రోడ్ నం. 45 నుంచి నిర్మించిన ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రజలకు అంకితం చేశారు. దీనికి పెద్దమ్మతల్లి ఎక్స్‌ప్రెస్ వే అని పేరుపెట్టారు.

# రైతుకు రక్షణగా నూతన రెవెన్యూ చట్టం

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 28 : సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన నూతన రెవెన్యూ చట్టం రైతులకు రక్షణగా నిలువనుందని భువనగిరి ఎమ్మెల్యే ఫైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. నూతన రెవెన్యూ చట్టం అమలులోకి రావడంతో సీఎం కేసీఆర్ కు కృతజ్ఞతగా జిల్లా కేంద్రంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. భువనగిరి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ట్రాక్టర్ ర్యాలీని ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి ప్రారంభించారు.

ర్యాలీ రాయగిరి నుంచి ప్రారంభమై భువనగిరి పాత బస్టాండ్ మీదుగా ప్రధాన రహదారిలో వినాయక చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..భూముల సమస్యలకు పరిష్కారం కోసమే నూతన రెవెన్యూ చట్టాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చారని తెలిపారు. అవినీతి, అక్రమాలకు, కబ్జాలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా ఈ చట్టం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పదవికి రాజీనామా చేసి నష్టపోయా:హర్‌సిమ్రత్ కౌర్

చండీగఢ్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయడం వల్ల తానేమీ పొందలేదని, దీని వల్ల తానే నష్టపోయానని శిరోమణి అకాలీదళ్ నాయకురాలు హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ తెలిపారు. అయితే తన రాజీనామా వల్ల రైతుల సమస్యలు కేంద్రం దృష్టికి వెళ్లాయని చెప్పారు. వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలు మిన్నంటడంతోనే పార్లమెంట్ సమావేశాలను కుదించారని ఆమె విమర్శించారు. అగ్రి బిల్లులకు వ్యతిరేకంగా పంజాబ్‌లో రైతుల నిరసనలు తీవ్రమైన నేపథ్యంలో సోమవారం పార్టీ సమావేశంలో హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ మాట్లాడారు. దీనికి ముందు ముక్త్సర్ సాహిబ్‌లోని గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# విప్లవవీరుల చరిత్రలను పదిలం చేయాలి

నేటి నిజం
మంగళవారం 29-9-2020

దేశం కోసం ఎందరో రక్త తర్పణం చేశారు. ఎందరో ప్రాణత్యాగాలు చేశారు. కానీ వారంతా కనుమరుగ య్యేలా చరిత్రను వక్రీకరించారు. వారి చరిత్రను భవిష్యత్ తరాలు స్ఫూర్తిగా తీసుకునేలా చేయడంలో ఆనాటి పాలకులు విస్మరించారు. మరుగున పడ్డ మహావీరులెందరో ఉన్నారు. వారందరి చరిత్రను మనమంతా మననం సుకోవాలి. అందులో ఎలాంటి వక్రీకరణలకు తావు లేకుండా చరిత్రను లిఖించుకోవాలి. స్వాత్ర్య పోరాటంలో ఒక్కొక్కరిదీ ఒక్కోవిధానం. అందులో అగ్రగణ్యులు భగత్ సింగ్. ఆయన పోరాటం అనన్య సామాన్యం. ఆయన దేశభక్తి అకుంఠితం. ఆయనను ఉరితీయకుండా ఆపేశక్తి ఆనాడు గాంధీకి ఉన్నా ఎందుకనో ఆయన మౌనం వహించారు. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. తన అహింసా సిద్దాంతానికి భగత్‌సింగ్ విప్లవ విధానాలు నచ్చకపోఇ ఉండవచ్చు. అందుకే భగత్‌సింగ్ ఉరితీతను మహాత్ముడు అడ్డుకోలేక పోయారన్న విమర్శలు ఉన్నాయి. వందేమాతరం, అహింస, సత్యాగ్రహం వంటి వాటితో స్వాతంత్ర్య పోరాటం చేస్తున్న మహాత్ముడి ఆలోచనలకు భిన్నంగా భగత్‌సింగ్ 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ బ్రిటిష్ వారిని ఎదిరించిన ధీశాలి. ఆయనపై దేశద్రోహం కేసుతో పాటు అనేక కేసులు పెట్టి బ్రిటిష్ట ప్రభుత్వం వేధించినా ఏనాడూ బెదరలేదు. కోర్టు విచారణకు హాజరైన ప్రతిసారి భగత్‌సింగ్ బృందం అదే నినాదమిస్తూ ప్రవేశించేది. 'విప్లవం వర్ధిల్లాలి' అన్న ఆ మాటలు బ్రిటిష్ న్యాయమూర్తికి మింగుడు పడలేదంటే ఎంతగా బ్రిటిష్ పాలకులకు కంట్లో నలుసుగా తయారయ్యారో అర్థం చేసుకోవచ్చు. భగత్‌సింగ్ పేరు చెబితేనే బ్రిటిషర్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తేవి. దేశ స్వాతంత్ర్యం కోసం ముందుగా బ్రిటిష్‌వారి పాలన నుంచి విముక్తి కల్పించాలన్న ఆకాంక్ష బలంగా ఉండేది. అలాగే స్వాతంత్ర్యం కోసం అహింస అనే ఆయుధాన్ని నమ్మడం సరికాదని భగత్‌సింగ్ భావించేవారు. అలా అని వ్యక్తిగత హింసకే పట్టం కట్టాలని అనుకోలేదు. అతి చిన్న వయసులోనే అపారమైన అనుభవం సాధించాడు. భారత ప్రజల విమోచనకు విప్లవపంథానే మార్గమని భగత్‌సింగ్ నమ్మాడు. దానిని అమల్లో పెట్టడం కోసం తన పంథాలో పోరాటం చేసిన గొప్ప వీరుడుగా ఇవాళ చరిత్ర పుటల్లో నిలిచి ఉన్నారు. అందుకే విప్లవానికే అంకితమైన కార్యకర్తలు ఉండాలని ప్రతిపాదించాడు. ఇలా బగత్‌సింగ్ లాగా ధన, ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించిన ఎందరో కనుమరుగయ్యారు. వారందరి చరిత్రలను మనం రాసుకోవాలి. తెలంగాణ ఉద్యమంలా ఊరుకో వీరుడు కనిపిస్తాడు. భగత్‌సింగ్ పేరు చెప్పగానే ప్రధానంగా పార్లమెంటులో బాంబు ప్రయోగం, ధైర్యంగా ఉరికంబం ఎక్కడం గుర్తుకు వస్తాయి. నిజానికి నెత్తి మీద టోపీతో మన మనసులలో స్థిరపడిన భగత్‌సింగ్ ఇమేజికన్నా ఆయన ఉజ్వల జీవితం ఎన్నో రెట్లు విశిష్టమైంది. ఆయన సమరశీల జీవితం ఆ కాలానికి అని తర సాధ్యమైనవి. ప్రత్యేకించి యువత కు అవి మార్గదర్శకాలు. పాతికేళ్లు రాకుండానే ఉరికంబం ఎక్కిన యువ కిశోరం గనక ఆయన యువతకు మార్గదర్శకుడయ్యాడన్నది గుర్తుంచుకో వాలి. నిజానికి యువతకు అలాంటి ఆవేశం కావాలి. అది దేశం కోసం కావలి. దేశంలో స్వార్థపూరితమైన ధన రాజకీయాలు వెర్రితలలు వేస్తున్న ఈ రోజుల్లో ఇలాంటి మహానుభావుల చరిత్రలు మనకు పనికివస్తాయి. భిన్నమైన విశాల రాజకీయాలను లోతైన సిద్దాంత దృష్టిని ప్రదర్శించిన భగత్‌సింగ్ ఆదర్శప్రాయుడని గుర్తించాలి. ఆయన చేసిన సాహసాలు నిరంతర మననం కావాలి. ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక భాగస్వామి. ఆయన చైతన్యం ఆనాటి బ్రిటిష్ పాలకులకు వణుకు పుట్టించేంది. విప్లవానికి ఆధారం ఆయుధాలు, దౌర్జన్యకర చర్యలు కావని, ప్రజా బలమేనని చాటి చెప్పాడు. నిజమైన విప్లవకారులు అంటే ఏమిటో తన ఆచరణలో చూపాడు. ప్రజల కోసం పని చేయడంలోనే అత్యధిక త్యాగం ఉన్నదని భగత్ సింగ్ ఎపస్పుడూ చెప్పేవారు. సుఖలాలస కోసమే జీవితం కాదు, లక్ష్య సాధనకు అంకితం కావాలని ఆయన అనేక చోట్ల సందేశమిచ్చారు. పుస్తక పఠం కూడా భగత్‌సింగ్‌ను రాటుదేలేలా చేసింది. తనను ఉరి తీస్తారని తెలిసిన తర్వాత కూడా పుస్తకాలు ఆపకుండా చదవేవాడు. ఈ విషయంలోభగత్‌సింగ్ మృత్యువును లెక్క చేయని ధీరత్వం ప్రదర్శించాడు. సోక్రటీస్ కూడా మరో అరగంటలో ఉరితీస్తారనగా ఇంతటి ధీరత్వంలోనే ఉన్నారని చెబుతారు. చివరి వరకు ఏదో నేర్చుకోవాలన్న తపన సోక్రటీస్‌లో ఉండేది. అలాగే భగత్‌సింగ్ కూడా తన ప్రాణాల ద్వారా అయినా స్వాతంత్ర్యం సిద్దించాలని ఆకాంక్షించే వారు. అందుకే ఆయన ఉరికపంబాన్ని ముద్దాడారు. భగత్‌సింగ్ జీవితంలో ఘటనలు పరిశీలిస్తే ఆయన వ్యక్తిత్వం ఎంత దృఢమైందో అర్థమవుతుంది. ఎట్టి పరిస్థితులలోనూ పోరాడాలే గాని ప్రాణాలు తీసుకోవడం తప్పన్న భావనలో ఉండేవాడు. జలియన్ వాలాబాగ్ ఘటన భగత్‌సింగ్‌ను బాగా కలచివేసింది. అందుకే అక్కడికి వెళ్లి పిడికెడు మట్టి జేబులో వేసుకుని వచ్చిన భగత్‌సింగ్ స్వాతంత్ర్య ఆకాంక్ష ఎంతటి బలమైనదో గుర్తించుకోవాలి. ఇలా భగత్‌సింగ్‌తో అనేకమంద ఇపోరాడారు. అనేకమంది ఆనాటి తెల్లవారి తూటాలకు బలయ్యారు. విప్లవ పథంలో అడుగిడినప్పుడే నా ప్రాణాలర్పించి దేశమంతటా ఇంక్విలాబ్ జిందాబాద్ ..విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని వ్యాపింప చేయగలిగితే జీవితం ధన్యమైపోతుందనుకున్నాడు. జైలు గదిలో కూర్చున్నప్పటికీ కోట్లాది మన ప్రజల కంఠం నుండి వెలువడుతున్న ఆ నినాదాన్ని వినగలుగుతున్నాను. ఈ నా నినాదం స్వాతంత్ర్య సంగ్రామాన్ని ఉద్దీపింపచేసే శక్తిగా ప్రజ్వరిల్లి బ్రిటిష్ పాలకులను తరిమి కొడుతుందని ధైర్యంగా చెప్పిన ధీశాలి మన భగతేసింగ్. అలాంటి వీరుడిని కన్నందుకు ఈ దేశం ఎంతో గర్విస్తుంది. భగత్‌సింగ్ మాటలు, జీవితం కోట్ల మంది యువతకు నాటికీ నేటికీ ప్రేరణగా కొనసాగుతున్నాయి. దేశంలో అవినీతి,అక్రమాలు రాజ్యమేలుతున్నప్పుడు ప్రతి ఒక్కరూ ఒక్కో భగత్‌సింగ్ అవతారమెత్తాల్సిందే. మరుగున పడ్డ మన యువకిశోరాల చరిత్రను వెలికి తీయాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. అది చేస్తే దేశం కోసం త్యాగం చేసుకున్న వారిని స్మరించుకునే అవకాశం పెరుగుతుంది.

## ఆత్మనిర్భర భారత్‌లో రైతులదే కీలకపాత్ర

### కరోనా సంక్షోభంలోనూ సత్తా చాటిన వ్యవసాయరంగం

### కొత్త వ్యవసాయ బిల్లుతో రైతుకు మరింత భరోసా

### మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ ఉద్ఘాటన

న్యూఢిల్లీ,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): ఆత్మనిర్భర భారత్÷-లో రైతులదే కీలకపాత్ర అని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. రైతులు పండించిన పంటలను మార్కెట్ కమిటీలకు తెచ్చి అమ్ముకోవడం ద్వారా రైతులు కొన్ని రాష్ట్రాల్లో లాభాలు ఆర్జిస్తారని తెలిపారు. కరోనా సమయంలో మన వ్యవసాయరంగం తన సత్తా చాటిందని...స్వావలంబన భారతాన్ని నిర్మించే ప్రయత్నంలో రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రధాని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ నెల 28వ తేదీన షహీద్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా ప్రధాని మోడీ ఆయన సేవలను గుర్తు చేసుకొన్నారు. అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ..కొత్త బిల్లులతో కనీస మద్దతు ధరకు నష్టం వాటిల్లదని..దీనిపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మోడ్గీ÷ర్ అయ్యారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాన్ని కాంగ్రెస్ పాటించి ఉంటే...స్వావలంబన భారత్ నినాదం అవసరముండేదే కాదని... భారత్ కొన్ని సంవత్సరాల కిందటే స్వావలంబన భారత్ గా ఎదిగి ఉండేదని పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా...కేంద్రం తెచ్చిన వ్యవసాయ బిల్లులను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే.

కొత్త బిల్లులతో కనీస మద్దతు ధరకు నష్టం వాటిల్లదని, అది ఉంటుందని, ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాన్ని కాంగ్రెస్ వారు పాటించి ఉంటే.. 'స్వావలంబన భారత్' నినాదం అవసరముండేదే కాదని, భారత్ కొన్ని సంవత్సరాల కిందటే స్వావలంబన భారత్ గా ఎదిగి ఉండేదని ఆయన పేర్కొన్నారు. కథలు చెప్పడం, కుటుంబ విలువలను ప్రాధాన్యాన్ని వివరించిన మోదీమన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ కథలు చెప్పే కళను, కుటుంబ వ్యవస్థను ఉటంకిం చారు. కరోనా మహమ్మారి కుటుంబ వ్యవస్థను, విలువలను పెంచిందని, కుటుంబ సంబంధాలను మరింత దగ్గర చేసిందని పేర్కొన్నారు. కానీ కొన్ని కుటుంబాల్లో సమస్యలున్నాయని,వారు విలువలతో సంబంధాన్ని కోల్పోయారని, అలాంటి వారికి కథలెంతో సహాయపడతాయని ఆయన అన్నారు. భారతదేశంలో కథలు చెప్పే సంప్రదాయం ఉంది. తమిళనాడు, కేరళలో ఈ సంప్రదాయం విశేషంగా ఉంది. ఈ సంప్రదాయాన్ని వారు 'విల్లుపట్టు' అంటారని మోదీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 'బెంగళూరు కథా సమూహం' సభ్యులతో ప్రధాని ముచ్చటించారు. స్వాతంత్ర్య సమయంలో జరిగిన కథలు, స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి వీరగాథలను ఈ తరానికి చెప్పాలని మోదీ వారికి విజ్ఞప్తి చేశారు. 'హితోపదేశం, పంచతంత్ర' అన్న కథల సంప్రదాయం మన దేవంలో ఉందని, కథల్లో జంతువులు, పక్షుల వివరణ ఉంటుందని ,దీని ద్వారా మన ఊహా శక్తి పెరుగుతుందని మోదీ పేర్కొన్నారు.

## మల్లికార్జునస్వామి ఆలయంలో విగ్రహాల ధ్వంసం

మేడ్చల్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): ఏపీలోనే కాదు తెలంగాణలోనూ దేవతా విగ్రహాల విధ్వంసం జరుగుతోంది. మేడ్చల్ జిల్లా గౌడవెల్లి గ్రామ పరిధిలో దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. స్థానిక మల్లికార్జున స్వామి వారి ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేశారు. అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. బంగారం వస్తువులతో పాటు హుండీలోని నగదును ఎత్తుకెళ్లడంతో పాటు స్వామి వారి చేతిలోని ఆయుధాలను అపహరించారు. ఆలయ పూజారుల సమాచారంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నలుగురు దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి దారుణానికి ఒడిగట్టిన వారిని అరెస్ట్ చేయాలని భక్తులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆలయాల దగ్గర రక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసులు తెలిపారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి సీఎం కెసిఆర్ నివాళి

హైదరాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): కొండా లక్ష్మణ్ బాపూజీ నేటితరానికే కాకుండా భావితరాలకు స్ఫూర్తి అని ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, తొలిదశ తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ 105వ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన ప్రగతి భవన్‌లో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో, నాన్ ముల్కీ ఆందోళనలో బాపూజీ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడు లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు.

## వ్యాక్సిన్ కోసం మోడీ చొరవ అద్భుతం-మోడీకి టెడ్రోస్ అభినందన

న్యూఢిల్లీ,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ చీఫ్ టెడ్రోస్ భారత ప్రధాని మోదీని ప్రశంసించారు. మోదీ శనివారం జరిగిన 75వ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీలో మాట్లాడిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా మోదీ.. ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ అందించేందుకు భారత్ సహాయం చేస్తుందని అన్నారు. ఈ క్రమంలో మోదీ చూపుతున్న చొరవకు గాను టెడ్రోస్ ఆయనను అభినందించారు. ఈ మేరకు టెడ్రోస్ తాజాగా ఓ ట్వీట్ చేశారు. భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద వ్యాక్సిన్ ఉత్పత్తి కేంద్రంగా ఉందని మోదీ అన్నారు. అందువల్ల ప్రపంచ దేశాలకు కోవిడ్ వ్యాక్సిన్‌ను అందించే సత్తా భారత్‌కు ఉందని, తాము ఈ విషయంలో ఇతర దేశాలకు సహాయం చేస్తామని తెలిపారు. కాగా మోదీ ప్రపంచ దేశాల్లో

కరోనాపై చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలుస్తున్నందుకు ఆయనకు టెడ్రోస్ ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ దేశాలన్నీ ఇలాగే కలసికట్టుగా ఉండి సహకారం అందించుకోవాలని, అప్పుడే కరోనా వైరస్‌ను అంతమొందించగలమని అన్నారు.

# కెసిఆర్ డైరెక్షన్..కెటిఆర్ యాక్షన్

### ఇద్దరి కనుసన్నల్లో రాజకీయ వ్యూహాలు

### రేపటి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎత్తుగడలు

### ఒక్కో ఎన్నికకు ఒక్కో రకమైన కార్యాచరణ

### కెటిఆర్ ఆధ్వర్యంలో అమలవతున్న నిర్ణయాలు

హైదరాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): సిఎం కెసిర్ డైరెక్షన్..తనయుడు మంత్రి కెటిఆర్ యాక్షన్.. ఇప్పుడు వీరిద్దరి వ్యూహంతోనే రాజకీయాలు సాగుతున్నాయి. అందుకు గత కొంతకాలంగా రానున్న పలు ఎన్నికలకు అనుగుణంగా వ్యూహాలు సాగుతున్నాయి. దుబ్బాక ఉప ఎన్నిక కావచ్చు.. గ్రేటర్ ఎన్నికలు కావచ్చు..అలాగే ఎమ్మెల్సీ పట్టభద్ర ఎన్నికలు కావచు..ఒక్కోదానికి ఒక్కో వ్యూహంతో కార్యాచరణ సిద్దంగా ఉంది. దాని మేరకే కార్యక్రమాలు సాగుతున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు మొదలు క్షేత్రస్థాయి కార్యకర్త వరకుఎలా నడుచుకోవాలో స్పష్టత ఉంది. తెరవెనక సూత్రధారి సిఎం కెసిఆర్ అయితే..తెరముందు కెటిఆర్ కనిపిస్తున్నారు. ఇప్పుడు అన్నీ కెటిఆర్ నడిపిస్తున్నారు. ఎన్నికల్లో గెలుపు వ్యూహాలను రచిస్తున్నారు. పట్టభద్ర స్థానాల నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీజేపీ నేత ఎన్ రాంచందర్‌రావు పదవీకాలం మార్చి నెలాఖరుతో ముగియనున్నది. కెటిఆర్ దృష్టి తొలుత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పడింది. ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కొనేలా, అభివృద్ధి మంత్రంతో ప్రజల్లోకి వెళ్లే వ్యూహాలకు పదును పెడ్తున్నారు. త్వరలో జరుగనున్న హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్ నగర్, నల్లగొండ- వరంగల్- ఖమ్మం స్థానాల్లో గులాబీ జెండాను రెపరెపలాడించేలా ముందుకు సాగుతు న్నారు. అర్హులైనవారందరికి ఓటు హక్కు కల్పించాలి.. ఓటర్లను చైతన్యపరిచి పోలింగ్ బూత్‌కు తీసుకుని రావాలి.. టీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజల కండ్లముందుంచాలి.. మొత్తంగా ఎన్నికల రేస్‌లో మరోసారి కారు జోరు కొనసాగాలి. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి కేటీఆర్ చేస్తున్న దిశానిర్దేశం ఇది. వచ్చే మార్చిలో జరుగనున్న హైదరాబాద్-రంగారెడ్డి- మహబూబ్‌నగర్, నల్లగొండ- వరంగల్- ఖమ్మం ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం సాధించేలా ఆయన పకడ్బందీ వ్యూహం రచించారు. అక్టోబర్ ఒకటి నుంచి 45 రోజులపాటు ప్రత్యేక కార్యాచరణను అమలుచేయనున్నారు. ఇప్పటికే ఆరు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలతో వేర్వేరుగా సమావేశమైన కేటీఆర్.. ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ పార్టీ గెలుపుకోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. వార్డుస్థాయి నుంచి టీఆర్ఎస్‌కు నెట్‌వర్క్ ఉందని.. మరే పార్టీకి ఇంతటి నెటవర్క్ లేదని, పార్టీ అభ్యర్థుల గెలుపు తథ్యమని నేతలను ఉత్సాహపరుస్తున్నారు. గ్రామస్థాయి నుంచి అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని, నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఓటరు నమోదుపై అవగాహన తీసుకురావాలని సూచించారు. ఉమ్మడి ఆరు జిల్లాల్లోని 77 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించేలా కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇప్పటికే రెండు స్థానాల్లోని పార్టీ ఎన్నికల ఇంచార్జిలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ ముఖ్యులు తదితర నాయకులతో మాట్లాడారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ఇకనుంచి తరచుగా వీరితో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహించనున్నారు. కేటీఆర్ ఆదేశాలతో ఇప్పటికే టీఆర్ఎస్ పార్టీ గ్రామ, మండల నియోజకవర్గాల వారీగా నియమించిన ఓటరు నమోదు ఇంచార్జిలు తమ పనులు మొదలుపెట్టారు. రంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల స్థానంలో మొదటి నుంచి టీఆర్ఎస్ గెలుస్తూ వస్తున్నది. ఇప్పటికే హ్యాట్రిక్ కొట్టగా నాలుగోసారీ గెలవాలని ఉవ్విళ్లూరుతున్నది. అభివృద్ధి ఎజెండా, 1.5 లక్షల ఉద్యోగాల భర్తీ, మరో 15 లక్షల మందికి ఉపాధి కల్పించిన విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా కేటీఆర్ ప్రణాళిక రచించారు. పల్ఎలె ప్రగతి, పట్టణ ప్రగతి, రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు, సాగునీటి రంగం, పంటల కొనుగోలు, ఇంటింటికి తాగునీరు, కొత్త మండలాలు, జిల్లాల ఏర్పాటు, నల్లగొండ జిల్లాలో ఎ÷-లోరైడ్ సమస్యకు పరిష్కారం, పచ్చగా మారిన పాలమూరు.. తదితర విజయాల్లో టీఆర్ఎస్ పాత్రను వివరించనున్నారు. మొత్తంగా పార్టీ గెలుపే లక్ష్యంగా కేటీఆర్ ముందుకు సాగుతున్నారు. ఇక గ్రేటర్ ఎన్నికల్లో వ్యూహం మరోలా ఉంటుంది. రాష్ట్రానికి ప్రపంచస్థాయి కంపెనీలు, పారిశ్రామిక ప్రోత్సాహం, హైదరాబాద్ మహానగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై కెటిఆర్ దృష్టిపెడుతూ వస్తున్నారు. హైదరాబాద్లోఓ దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి ప్రారంభం,ప్రజలతో కలసి సంబరాలు నిర్వహించడం ఇందులో భాగమే. గ్రేటర్ పరిధిలోని కార్పొరేటర్లతో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి ప్రత్యేకంగా ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై సమావేశమయ్యారు. నగరంలో పెద్దఎత్తున ఉండే పట్టభద్రులందరినీ ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ప్రణాళికలో భాగంగా.. ఓటర్ల నమోదు, ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చేలా చర్యలు చేపట్టనున్నారు. అలాగే గ్రేటర్ ఎన్నికల కోసం అనేక కార్యక్రమలు చేపట్టారు. డబుల్ ఇళ్లను ప్రజల్లో మళ్లీ రగిలించారు. వారిలో ఇంటి ఆశలు పెరిగాయి. ఇది ప్లస్ పాయింట్ కానుంది. మొత్తంగా కెటిఆర్ ఎన్నికల్లో దూకుడు ప్రదర్శిస్తున్నారు.

# రాంమాధవ్‌కు కేబినేట్ బెర్త్ దక్కనుందా?

### రామ్ సేవలను ప్రభుత్వంలో ఉపయోగించుకునే అవకాశాలు

### పురంధేశ్వరికి ప్రధానకార్యదర్శిగా నియామకంలోనూ ఎత్తుగడ

### రాష్ట్రంలో టిడిపిని దెబ్బకొట్టేలా పార్టీ వ్యూహాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): రాంమాధవన్ పార్టీ పదవుల నుంచి తొలగించడం వెనక ఆయనను కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకునే ఆలోచన ఉందన్న ప్రచారం సాగుతోంది. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చి పార్టీలో కీలక భూమిక పోషించిన రాం మాధవ్ ఇప్పుడు మంత్రివర్గంలోనూ చేరే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. లేదా బీహార్ ఎన్నికల వ్యూహం కోసం తాత్కాలికంగా ఆయనను ఉపయోగించుకోవచ్చు.

ఇన్నాళ్లూ బిజెపి జాతీయ రాజకీయాల్లో కీలకంగా ఉన్న తెలుగు వ్యక్తి రామ్‌మాధవ్‌ను ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పించారు. అంతకు ముందు వివిధ రకాల పార్టీ పదవుల నుంచి ఆయన్ను తప్పించారు. అయితే రామ్ మాధవ్‌కు కేంద్ర మంత్రిని చేసేందుకే ఆయన్ను పార్టీ పదవుల నుంచి తప్పించారని బిజెపి నేతలు చెప్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఏపి, తెలంగాణ రెండు రాష్ట్రాలు ప్రాధాన్యతగా పెట్టుకున్న బిజెపి ఎపి నుంచి కూడా ఒకరికి కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలనే ఆలోచనలో ఉంది. ఇప్పటికే తెలంగాణాకు కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండగా..ఎపి నుంచి రామ్ మాధవ్‌కు అవకాశం కల్పించనున్నారు. కర్నాటకలోని రాజ్యసభ ఎంపి ఒకరు కరోనా కారణంగా చనిపోవడంతో ఆయన స్థానంలో రామ్ మాధవ్‌ను ఎంపిగా చేసి ఆ తర్వాత ఆయన్ను కేంద్ర మంత్రిగా తీసుకుంటారని కొందరు బిజెపి నేతలు అంటున్నారు. రాంమాధవన్ తప్పించిన కారణంగా పురంధేశ్వరిని జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారని కూడా అంటున్నారు. దీంతో ఇక ఎపిలో టిడిపి లక్ష్యంగా బిజెపి ముందుకు సాగనుంది. సోము వీర్రాజులో కాపులను, పురంధేశ్వ రితో కమ్మలను లాక్కునే లక్ష్యంగా బిజెపి రాజకీయ వ్యూహాలు నడిపే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కీలక పార్టీగా ఎదగాలని భావిస్తున్న బిజెపి అందుకు తగ్గ కార్యాచరణతో సమాయత్తమయింది. ముఖ్యంగా టిడిపి నేతలను, కేడర్‌ను టార్గెట్ చేసుకొని రాజకీయాలు నడపాలని భావిస్తోంది. సోషల్ ఇంజనీరింగ్ ఎత్తుగడగా కొందరు అభివర్ణిస్తున్నారు. అందులో భాగంగానే దగ్గుబాటి పురంధేశ్వరికి కొత్తగా ప్రకటించిన జాతీయ కమిటీలో ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టింది.

అయితే గతంలో టిడిపి నుండి కాంగ్రెస్‌కు మారి కేంద్ర మంత్రిపదవిని అలంకరించినా, తర్వాత బిజెపికి ఫిరాయించి గత ఎన్నికల్లో పోటీ చేసినా రాష్ట్రంలో పెద్దగా ప్రభావితం చేయలేకపోయారు. ఇప్పుడు బిజెపి అధిష్టానం ప్రధానకార్యదర్శి పదవి కట్టబెట్టడంతో ఆమె మరింత దూకుడుగా సాగే అవకాశాలు ఉన్నాయి. మరో వైపున వైసిపికి దగ్గరగా ఉన్నందునే రాజ్యసభ ఎంపి జివిఎల్ నరసింహరావును అధికార ప్రతినిధి హోదా నుంచి తొలగించిందని కొందరు అంటున్నారు. బిజెపికి దేశవ్యాప్తంగా ఉండే ఎనిమిది మంది ప్రధాన కార్యదర్శులలో ఒకరిగా పురంధేశ్వరిని నియమించారు. పార్టీ అధ్యక్షుడి తర్వాత పార్టీలో శక్తివంతమైన నేతలుగా ప్రధాన కార్యదర్శులు ఉంటారు. వీరు ఒక్కొక్కరు నాలుగు నుండి ఐదు రాష్ట్రాలకు పార్టీ ఇంఛార్జులుగా ఉంటారు. ఆ రాష్ట్రాల్లో నిర్ణయాలన్నీ వీరి ద్వారా జరు గుతాయి. అంతేకాక వీరు నేరుగా ప్రధాన మంత్రి మోడీ, హోంమంత్రి అమిత్‌షాలతో టచ్‌లో ఉంటారు. పార్టీకి సంబంధించిన ఏ పనులైనా నేరుగా వీరు ప్రధానమంత్రి ద్వారా చేయించుకునే స్థితిలో ఉంటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బలహీనంగా ఉన్న పార్టీని పటిష్ఠం చేసుకునేందుకే పురంధేశ్వరికి ఇంత కీలకమైన పదవి అప్పజెప్పారని బిజెపి వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే టిడిపి నుంచి బిజెపిలో చేరిన సీనియర్ నేత సుజనా చౌదరితో సమన్వయం చేసుకుంటూ టిడిపిలో అసంతృప్తిగా ఉన్న నాయకత్వాన్ని పార్టీలోకి లాగాలనే వ్యూహాన్ని పురంధేశ్వరి అమలు చేయనున్నారు. టిడిపి బేస్‌ను దెబ్బకొట్టి తాము బలపడాలనే లక్ష్యంతో బిజెపి ఉంది. బిజెపి...జనసేనతో పొత్తు ద్వారా మరో సామాజిక నవీకరణను నెరువేర్చుకోంటోంది.

## కేరళలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు

### మరోమారు కఠిన లాక్‌డౌన్ విధించక తప్పనిపరిస్థితి

### ఆరోగ్యశాఖ మంత్రి శైలజ వెల్లడి

తిరువనంతపురం,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ):కేరళలో మళ్లీ కఠినమైన లాక్‌డౌన్ విధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కరోనా కేసులు పెరగడంతో గత్యంతరం లేదన్న భావనలో ప్రభుత్వం ఉంది. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కేకే శైలజా ఈ అనుమానాలు వ్యక్తం చేశారు. ఇటీవల ఓనమ్ పండుగ తర్వాత రాష్ట్రంలో మళ్లీ కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరిగింది. ఒకవేళ ఇదే విధంగా కేసులు పెరుగుతుంటే, అప్పుడు లాక్‌డౌన్ విధించక తప్పదు అని ఆమె హెచ్చరించారు. మీడియాతో మాట్లాడిన మంత్రి .. రాష్ట్రంలో కోవిడ్19 పరిస్థితి కీలకంగా ఉందని, ఒకవేళ నిబంధనలు పాటించకుంటే, అప్పుడు ప్రజలు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ఆమె అన్నారు. వాస్తవానికి కేరళలో తొలుత కేసులు బయటపడ్డా.. కట్టుదిట్టమైన నిబంధనలతో ఆ కేసులను అదుపు చేశారు. అయితే ఇటీవల ఓనమ్ పండుగ సమయంలో జనం హద్దుమీరారు. దీనికి తోడు ఇటీవల నిరసన ప్రదర్శలు కూడా ఎక్కువయ్యాయి. రాష్ట్రంలో వైరస్ పాజిటివ్ రేటు మళ్లీ 12 శాతం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. కోవిడ్ నిబంధనలు కఠినంగా పాటిస్తేనే వైరస్ అదుపులో ఉంటుందని, లేని పక్షంలో లాక్‌డౌన్ విధించాల్సిన అవసరం వస్తుందని మంత్రి శైలజా తెలిపారు. 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్నవారిలోనే కేసులు అధికంగా నమోదు అవుతున్నట్లు ఆమె చెప్పారు. 72 శాతం వృద్ధులు, 28 శాతం యువత కోవిడ్‌తో మృతిచెందినట్లు ఆమె వెల్లడించారు.

## అక్టోబర్ 5 వరకు స్కూళ్లు మూసివేత

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: రోజురోజుకు పెరిగిపోతున్న కరోనా వ్యాప్తి కేసులను దృష్టిలో ఉంచుకుని అన్ని పాఠశాలలను వచ్చే నెల 5వ తేదీ వరకు మూసివేయాలని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (డీఈవో) జారీ చేసిన అధికారిక ఉత్తర్వు ప్రకారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు అన్నీ మూసివేస్తారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. అక్టోబర్ 5 వరకు ఆన్‌లైన్ అభ్యాసం, అభ్యాస కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయి.

ఢిల్లీలో కరోనా ఇన్ఫెక్షన్ కేసు వెలువడిన తరువాత మార్చి 16 నుంచి అన్ని పాఠశాలలు, కళాశాలలు మూసివేసారు. అనంతరం మార్చి 25 నుంచి దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలను మూసివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి నుంచి విద్యార్థులు ఇండ్లకే పరిమితమయ్యారు. పిల్లలు తమ విద్యను కోల్పోకుండా చూడటానికి ఆన్‌లైన్ ద్వారా విద్యను అందిస్తున్నారు.

తొలుత సెప్టెంబర్ 30 లోపు రాజధానిలోని అన్ని పాఠశాలలను మూసివేయాలని నిర్ణయించిన ఢిల్లీ ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కొన్ని షరతులతో సెప్టెంబర్ 21 నుంచి పాఠశాలలు, కళాశాలలను ప్రారంభించవచ్చనే ఊహాగానాలు వెలువడ్డాయి. అసోసియేషన్ ఆఫ్ అన్‌సీన్ సీబీఎస్ఈ మధ్యప్రదేశ్ ప్రకారం, మధ్యప్రదేశ్‌లోని తమ సంస్థకు అనుబంధంగా ఉన్న సీబీఎస్ఈ పాఠశాలలను సెప్టెంబర్ 21 నుంచి విద్యార్థులను మార్గదర్శకత్వం కోసం పాఠశాలకు పిలవాలని నిర్ణయించాయి. చాలా పాఠశాలల్లోని తరగతి గదులను శుభ్రపరిచారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చిన తరువాత వారికి ఎలాంటి సమస్య రాకుండా ఉండేంట్లుగా టైమ్‌టేబుల్ తయారు చేశారు. స్కూల్ బస్సులు ప్రస్తుతానికి నడపవు. విద్యార్థులు తల్లిదండ్రుల సమ్మతి తీసుకుని పాఠశాలకు రావాల్సి ఉంటుంది.

### ఢిల్లీలో వేగంగా పెరిగిన వ్యాప్తి

ఢిల్లీలో కరోనా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ఆరోగ్య శాఖ నివేదిక ప్రకారం ఢిల్లీలో ఇప్పటివరకు మొత్తం 2 లక్షల 34 వేల 701 కేసులు నమోదయ్యాయి. లక్ష 98 వేల 103 మంది రోగులు నయమయ్యారు. రోగుల రికవరీ రేటు 84.40 శాతంగా ఉండగా.. మృతుల సంఖ్య 4,877 గా ఉన్నది.

# ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్న ప్రధాని మోడీ

### రైతులకు మద్దతు ధరలు రాకుండా కుట్ర

### ఆదానీఅంబానీ,అమెజాన్‌లకు దోచిపెట్టే కుట్ర

### పిసిసి చీఫ్ ఉత్తమ్ మండిపాటు

### కాంగ్రెస్ ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

### వచ్చీరాగానే ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్

హైదరాబాద్,సెప్టెంబర్28 (ఆర్ఎన్ఎ): ప్రధాని మోడీ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నారని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశం నిలబడ్డది వ్యవసాయం, రైతుల వల్లనే అని చెప్పుకొచ్చారు.అలాంటి రైతులకు ఉరి బిగిస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ బిల్లులతో రైతులు మరింత రోడ్డున పడే ప్రమాదం తీసుకుని వచ్చారని, వారికి గిట్టుబాటు ధరలు కూడా రావన్నారు. రైతు సమస్యలు చెప్పడానికి గవర్నర్ వద్దకు వెళతామంటే కూడా ఆటంకం కలిగిస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ వ్యతిరేక చట్టాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనలో భాగంగా గవర్నర్‌ను కలవడానికి వెళుతున్న వారిని పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ నేతలు రాజ్ భవన్‌కు ర్యాలీగా బయలుదేరారు. దిల్ కుషా గెస్ట్ హౌస్ గేటు వద్ద కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. కేసీఆర్‌కు, పోలీసులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు. ఏఐసీసీ ఇన్‌చార్జి మానిక్కం ఠాగూర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సంపత్ కుమార్, బోసురాజు, దామోదర రాజనర్సిహ్మ, శ్రీనివాస్ కృష్ణన్, దాసోజు శ్రవణ్, అనిల్ కుమార్ యాదవ్, శ్రీధర్ బాబు, చిన్నారెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతలు అరెస్ట్ అయ్యారు. దిల్ కుషా గేట్ బయట ఎమ్మెల్యే సీతక్క, ఇందిరా శోభన్, నేరెళ్ల శారద తదితర మహిళా కాంగ్రెస్ నేతలు బైఠాయించారు. అందరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ బీజేపీ భాగస్వామ్య అకాలీదల్, బీజేడీ సహా 18 పార్టీలు వ్యతిరేకించినా బిల్లులు ఆమోదించారని అన్నారు. అంబానీ, ఆదాని, అమెజాన్‌కు లాభం చేయడానికే ఈ బిల్లులు తెచ్చారని విమర్శించారు. రాజ్యసభలో బీజేపీకి బలం లేకపోయినా అక్రమంగా బిల్లులు ఆమోదించుకున్నారని వ్యాఖ్యానించారు. ఈ బిల్లుల్లో రైతులకు రక్షణ, ధరల హామీ లేదని.. కంపెనీలకు మాత్రమే స్వేచ్ఛనిస్తుందన్నారు.బిల్లుల వెనుకున్న కుట్రను రైతులు గమనించాలని సూచించారు. వ్యాపారులకు స్వేచ్ఛనిచ్చే బిల్లు తెచ్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రేడర్స్ నిత్యవసరాలు నిలువ చేసి ధరలు పెంచి అమ్ముకునే వీలు కల్పించారన్నారు. మార్కెట్ యార్డ్ బయట అమ్ముకునే ధాన్యానికి రైతులకు రక్షణ ఇవ్వలేదని చెప్పారు. రైతుల జీవితాన్ని దుర్భరం చేయడానికి, వ్యవసాయాన్ని నాశనం చేసే చట్టాలు తెచ్చారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ వ్యవసాయ బిల్లును వ్యతిరేకించడంలో చిత్తశుద్ధి లేదన్నారు. ఇప్పటి వరకు బీజేపీ తెచ్చిన అన్ని బిల్లులకు కేసీఆర్ మద్దతు ఇచ్చారని చెప్పుకొచ్చారు. మోదీతో కేసీఆర్ మిలాఖత్ అయ్యారని అన్నారు. రైతులకు బేడీలు వేసిన ఘనత కేసీఆర్‌ది అని విమర్శించారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీ ఎందుకు చేయడం లేదని... తెలంగాణలో క్రాప్ ఇన్సూరెన్స్ ఎందుకు లేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. టిఆర్ఎస్ పాలనలో కనీసం గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చే అవకాశం కూడా లేకుండా పోయిందని ఎమ్మెల్యే సీతక్క మండిపడ్డారు. గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తామంటే పోలీసులు అడ్డుకోవడమేంటన్నారు. వ్యవసాయ బిల్లులతో రైతులను అమ్మే కుట్ర జరుగుతోందన్నారు. బిజెపి ప్రభుత్వం తీరు దారుణంగా ఉందన్నారు. కెసిఆర్ వీటిని ఎందుకు వ్యతిరేకించడం లేదన్నారు. బిల్లులో మద్దతు ధరకన్నా ఎక్కువగా రైతులకు ధర కల్పించాలన్న అంశమే లేదని అన్నారు. కొత్త వ్యవసాయ చట్టం అమలు వద్దంటూ దేశవ్యాప్తంగా రాజ్‌భవన్‌ల వద్ద ఆందోళనలతో సహా గవర్నర్‌లకు వినతి పత్రం అందజేయాలని ఏఐసీసీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో రాజ్‌భవన్‌కు బయలుదేరిన కాంగ్రెస్ నేతలను పోలీసులు దిల్ కుషా గెస్ట్ హౌజ్ వద్ద అరెస్ట్ చేసి గోషామహల్ పోలీస్ట్ స్టేషన్ కు తరలించారు. దేశానికి వెన్నుముకగా ఉన్న రైతుకు ఇబ్బంది కలిగించేలా కేంద్రం తెచ్చిన మూడు చట్టాలపై కాంగ్రెస్ పోరాడుతుందని నేతలన్నారు. టీఆర్ఎస్, బీజేపీలు రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో గవర్నర్‌ను కలిసే స్వేచ్ఛ కూడా లేకుండా పోయిందని నేతలు మండిపడ్డారు.

# వేగవంతంగా ఆన్ లైన్ లోకి రూరల్ ప్రాపర్టీస్ .

## -సంబంధిత అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు.



సంగారెడ్డి, సెప్టెంబర్ 28 (నెటినిజం ప్రతినిధి) తక్షణమే రూరల్ ప్రాపర్టీస్ అన్ని కూడా ఆన్ లైన్ చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఎంపీడీవోలు తహసీల్దార్లు లకు ఆదేశించారు.

ఆదివారం కలెక్టర్ తన చాంబర్ నుండి అదనపు కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు ,జిల్లా పంచాయతీ అధికారి ,ఎంపీడీవోలు తహసిల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఆస్తులన్నింటినీ కూడా ఆన్లైన్ చేయాలని సూచించారు. ఎంపీడీవోలు తహసీల్దార్లు పంచాయతీ సెక్రెటరీ ల సహకారంతో పూర్తిస్థాయిలో ఆన్లైన్ చేయాలన్నారు. బాధ్యతగా అత్యవసరంగా చేయాల్సిన పనిగా గుర్తించాలన్నారు.

రైతు వేదికలు ,క ళ్ళాల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి కావాలని, ఇట్టి విషయంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

పల్లె ప్రకృతి వానాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు 597 స్థలాలు ఇచ్చినా ఇంకా పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డి పి ఓ కు సూచించారు.

గ్రీన్ ప్లాన్ లో భాగంగా కొత్త నర్సరీలను ఏర్పాటు చేయాలని, 10 వేల మొక్కల చొప్పున అంచనాలు ఇవ్వాలన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని హెడ్ క్వార్టర్ వదిలి వెళ్లకుండా కేంద్ర స్థానం లోనే ఉండాలన్నారు. పరిస్థితులను పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఏలాంటి ప్రమాద సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పురాతన భవనాలు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రానికి సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు.

ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రాజర్షి షా, వీరారెడ్డి, డిపిఓ వెంకటేశ్వర్లు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# వాగులో చిక్కుకున్న మత్స్యకారులు క్షేమం

కరీంనగర్,సెప్టెంబర్28(నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని వీణవంక మండలంలోని మానేరు వాగులో చిక్కుకున్న ముగ్గురు వ్యక్తులు క్షేమంగా బయటపడ్డారు. చేపలు పట్టడానికి వెళ్లిన మత్స్యకారులు వాగులో చిక్కుకుపోయారు. ఆ ముగ్గురు వాగులోనే దాదాపు పది గంటల పాటూ ఉన్నారు. విషయం తెలిసిన అధికారులు అక్కడకు చేరుకుని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో ముగ్గురు మత్స్యకారులను క్షేమంగా ఒడ్డుకు చేర్చారు.

# గుండెపైనా కరోనా ప్రభావం

## -అధ్యయనంలో తేలిందన్న మంత్రి హర్షవర్ధన్

న్యూఢిల్లీ,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): కరోనా అంటే ప్రధానంగా శ్వాసకోస సంబంధిత సమస్య.. ఇప్పటివరకూ అందరూ భావిస్తున్నది ఇదే! కానీ కరోనా వ్యాధిపై అధ్యయనం చేస్తున్న శాస్త్రవేత్తలు కొత్త కొత్త విషయాలను వెలికి తీస్తున్నారు. కరోనా మహమ్మారి గుండె వంటి కీలక అవయవాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు చెబుతున్నారు. అయితే ఇటువంటి అధ్యయనాలు తమ దృష్టి వచ్చాయని కేంద్రం తాజాగా వెల్లడించింది. ఈ మేరకు కేంద్రం ఆరోగ్య శాఖ మంత్రి హర్ష వర్దన్ ఆదివారం నాడు కీలక ప్రకటన చేశారు. గుండె వంటి కీలక అవయవాలపై కూడా కరోనా ప్రతికూల ప్రభావం చూపిస్తుందనే కొత్త ఆధారాల గురించి తమ దృష్టికి వచ్చిందన్నారు. 'ఈ విషయాలను నిపుణుల కమిటీ ఒకటి అధ్యయనం చేస్తోంది. ఈ విషయాల్ని పరిశీలించాలని ఐసీఎమ్ఆర్ వంటి సంస్థలకు కూడా సూచించాం' అని మంత్రి ప్రకటించారు. ఇదిలావుంటే కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న క్రమంలో వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు దేశ రాజధానిలో కరోనా పరీక్షలు ముమ్మరం చేశామని ఢిల్లీ ఆరోగ్య మంత్రి సత్యేంద్ర జైన్ వెల్లడించారు. పరీక్షల సామర్ధ్యాన్ని మూడు రెట్లు పెంచి రోజుకు 60,000 పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కోవిడ్-19 కేసులను అరికట్టేందుకు వ్యూహాత్మకంగా పరీక్షల సామర్థ్యాన్ని పెంచామని చెప్పుకొచ్చారు. ఢిల్లీలో వైరస్ కేసుల సంఖ్య రెట్టింపయ్యే సమయం 50 రోజులకు పెరిగిందని కోవిడ్-19 నుంచి ఇటీవల కోలుకున్న మంత్రి సత్యేంద్ర జైన్ వివరించారు. ఢిల్లీలో కరోనా వైరస్ రెండో విడత వ్యాప్తి ఊపందుకుందని సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్న క్రమంలో కరోనా పరీక్షలను ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపడుతోంది. ఇక ఢిల్లీలో కరోనా మరణాలు తగ్గాయని, మరణాల పదిరోజుల సగటు 0.94 శాతమని మంత్రి తెలిపారు. మొత్తంగా మరణాల రేటు 1.94 శాతంగా నమోదైందని చెప్పారు. ఏడు రోజుల సగటు ఆధారంగా ఢిల్లీలో పాజిటివిటీ రేటు 6.5 శాతమని వివరించారు.

# కేరళ సీనియర్ కాంగ్రెస్ నేత థామస్ మృతి

## -అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణం

తిరువనంతపురం,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): కేరళ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, చంగనచెర్రి ఎమ్మెల్యే సీఎఫ్ థామస్ ఆదివారంనాడిక్కడ కన్నుమూశారు. ఆయన వయస్సు 81 సంవత్సరాలు. తిరువళ్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రులో ఆయన కాన్సర్‌కు చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. థామస్ మృతికి రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్, విపక్ష నేత రమేష్ చెన్నితాల సంతాపం తెలిపారు. థామస్ 1980 నుంచి చెంగనచ్చరి నియోజకవర్గం నుంచి వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందుతున్నారు. కేరళ కాంగ్రెస్ వ్యవస్థాపక నేతల్లో ఆయన ఒకరు. పార్టీ అధ్యక్షుడు కేఎం మణి మరణానంతరం పీజే జోసెఫ్ వర్గంలో థామస్ చేశారు. కేరళ కాంగ్రెస్ జోసెఫ్ వర్గానికి డిప్యూటీ చైర్మన్‌గా కూడా ఆయన సేవలందించారు. 2001-2006లో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి, రిజిస్ట్రేషన్, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మంత్రిగా పనిచేశారు. కేరళ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, చైర్మన్‌గా కూడా థామస్ పనిచేశారు. కేరళ కాంగ్రెస్ దివంగత నేత కేఎం మణికి అత్యంత సన్నిహితుడనే పేరు ఆయనకు ఉంది.

# భగత్ సింగ్ జయంతి వేడుకలు..



వేములవాడ, సెప్టెంబర్ 28 (నేటినిజం ప్రతినిధి): దేశభక్తి కోసం పోరాటం చేసిన భగత్ సింగ్ 113వ జయంతి వేడుకలను చందుర్తి మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు, తెలంగాణ చౌక్ లో భగత్సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా దేశం కోసం భగత్ సింగ్ చేసిన పోరాటాలను కొనియాడారు, దేశభక్తి అంటే భగత్ సింగ్ కు ఎనలేని ప్రేమ అని గుర్తు చేశారు. దేశం కోసం 24 ఏళ్లకే భగత్ సింగ్ బ్రిటిష్ వారి చేతిలో ఉరితీయడం జరిగిందన్నారు, విప్లవం వర్ధిల్లాలి అనే నినాదం భగత్ సింగ్ కు పెట్టిన పేరు అన్నారు, ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వికృతి లక్ష్మీనారాయణ, నాయకులు మోహన్, పాటి సుధాకర్, శ్రీహరి, మధు, వికాస్ శ్రీకాంత్, సతీష్, శేఖర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు,

# ఎల్ఆర్ఎస్‌పై ప్రజల్లో ఆందోళన

## తినడానికే తిండి లేకుంటే డబ్బులెలా అని నిరసనలు

## వ్యాపారాలు దెబ్బతిన్నాయంటున్న రియల్టర్లు

హైదరాబాద్,సెప్టెంబరు28 (ఆంఎన్ఎ): ఎల్ఆర్ఎస్‌తో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పెనుభారం కానున్నది. గతంలో ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటికి ఇప్పుడు ఎల్ఆర్ఎస్ కింద మళ్లీ డబ్బులు చెల్లించడం ఏంటని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం ఎల్ఆర్ఎస్ పేదలు, సామాన్య ప్రజలతో పాటు రియల్ వ్యాపారుల్లో గుబులు రేపుతోంది. ప్రభుత్వం భూముల క్రయ, విక్రయాలకు ఎల్ఆర్ఎస్ నిబంధన విధించడంతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. అడ్వాన్సులు ఇచ్చి అగ్రిమెంట్లు చేయించుకుని వెంచర్లు వేసే రియల్టర్లతో పాటు అప్పులు తెచ్చి పైసా పైసా కూడబెట్టుకుని ప్లాట్లు కొనుక్కొనే సామాన్యుల వరకు ఎల్ఆర్ఎస్ నిబంధనతో ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీల పరిధిలో ఉన్న అక్రమ లేఅవుట్లు ఉన్న ప్లాట్లను కొనుగోలు చేసిన వారు వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో సమీప మున్సిపాలిటీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం క్రమేపీ పుంజుకుంది. కానీ కరోనా కారణంగా మార్చి నెల నుంచి భూముల క్రయవిక్రయాలు పెద్దగా జరగడం లేదు. అడ్వాన్సులు ఇచ్చి అగ్రిమెంట్లు చేసుకున్న వారు తరువాత వాయిదా కట్టలేక తెచ్చిన అప్పులు తీర్చలేక ఇబ్బందుల పాలయ్యారు. ఈక్రమంలో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుకు అక్టోబరు15 వరకు గడువు ఇవ్వడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. ఎల్ఆర్ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి జనవరి చివరి లోపు పూర్తి స్థాయిలో రుసుం చెల్లించాలని ప్రభుత్వం పేర్కొంది. అక్టోబరు 15లోగా వెయ్యి రూపాయల రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఇచ్చింది. కరోనా నేపథ్యంలో జీవనోపాధి కోల్పోయిన ఎన్నో పేద, సామాన్య కుటుంబాలకు ఎల్ఆర్ఎస్ గుబులు పట్టుకుంది. ఒక వైపు తాము జీవించడానికే సరిపడా డబ్బులు లేని సమయంలో ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ నిర్ణయం తీసుకోవడం ఎంత వరకు సమంజసమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడో కొన్న ఎ÷-లాట్లకు ఇప్పుడు మళ్లీ డబ్బులు చెల్లించడం ఏమిటని పలువురు సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా చాలా మందికి ఎల్ఆర్ఎస్‌పై పూర్తి స్థాయిలో అవగాహన లేదు. ఏ ప్లాట్లు ఎల్ఆర్ఎస్ స్కీం కింద వస్తాయి, ఏవి రావో తెలియక కొందరు అయోమయంలో ఉన్నారు. జిల్లాల్లో చాలా మంది ఆదాయ వనరులుగా రియల్ ఎస్టేట్ రంగాన్ని ఎంచుకున్నారు. కొంత మంది గ్రూపుగా ఏర్పడి వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయించే వారు. కాగా మరి కొందరు ప్లాట్లను విక్రయించి కమీషన్లు పొందేవారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేసుకునే వీలు కల్పించడంతో రియల్టర్లలో ఆందోళన మొదలైంది. దీంతో జిల్లాలోని ఆయా మండలాల్లో రియల్టర్లు ఏర్పాటు చేసిన వెంచర్లలో ప్లాట్ల క్రయ విక్రయాలపై తీవ్ర ప్రభావం పడింది. గతంలో చాలా మంది ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేసి ఎ÷-లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నారు. తాజాగా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను తెరపైకి తేవడంతో రియల్టర్లలో గుబులు మొదలైంది. అదేవిధంగా ప్రస్తుత పరిస్థితుల్లో ప్లాట్లను కొనుగోలు చేసేందుకు ప్రజలు ముందుకు రావడం లేదు. ఎల్ఆర్ఎస్‌కు తుది గడువు కొన్ని రోజులు మాత్రమే ఉండడంతో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

# బాలును విస్మరించిన తెలుగుచిత్రసీమ

## ఆయనను కనీసం దర్శించని ప్రముఖులు

## అంత్యక్రియలకు కరోనా పేరుతో కావాలనే దూరం

## సోషల్ మీడియా వేదికగా వార్తలు వైరల్

చెన్నై,సెప్టెంబరు28(ఆర్ఎన్ఎ): దివంగత బాలసుబ్రమణ్యం పట్ల తెలుగు చలనచిత్రసీమకు చెందిన ప్రముఖులు నిర్లక్ష్యం వహించారా?..కనీసం ఆయన ఆస్పత్రిలో ఉన్నా పలకరించకపోవడం. అంత్యక్రియల సమయంలో పాల్గొనకపోవడం వల్ల సోషల్ మీడియా వేదికగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమవాడంటూనే తమవాడిని దూరంగా పెట్టారని మండిపడుతున్నారు. ఇక సోషా మీడియాలో ఉన్న వార్తల్లోకి వెళితే..... నీవు బతికున్నప్పుడు అన్నాయ్యా అన్నారు, నీవు బతికున్నప్పుడు గాన గంధర్వుడని పొగిడారు.. నీవు బతికున్నప్పుడు పొగడ్తలతో ముంచెత్తారు. ఇప్పుడు నీవులేవు కదా నీతో వీరికి అవసరం తీరిపోయింది. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు నీకు నీవు సినీరంగానికి రాకముందు నుంచి పరిచయమట కదా? మెగాస్టార్ చిరంజీవి నీకు తమ్ముడిలాంటి వాడినని చెప్పుకునేవాడట కదా? బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ నుంచి బన్నీ వరకూ అందరూ నిన్ను గౌరవించేవారట కదా? నీవు మరలిపోగానే ఆ గౌరవం ఏమైందో..???? ముఖ్యమంత్రులు పిలిస్తే చార్టెడ్ ఫ్లైట్లు వేసుకుని మరీ వాలిపోయే ఈ 'తెర హీరో'లు నీ కడసారి దర్శనానికి తెరచాటుకు వెళ్లిపోయారేమిటో? కరోనా భయమా? తమిళనాడు ప్రభుత్వ పెద్దలు నీ దగ్గరకు వచ్చారు.కమల్ హసన్ లాంటి వారు ఆసుపత్రి నుంచి నీతోనే ఉన్నారు. వీరందరిని మించి అశేష జనవాహిని నిన్ను చూడటానికి వచ్చారే.. మరి ఈ 'జీరో'లకు ప్రాణ భయమా? నిన్ను చూస్తేనే కరోనా వస్తుందా?అశ్వినీదత్, రాఘవేంద్రరావు లాంటి వాళ్లు వాళ్ల చిత్రాలకు నీవు పాడిన పాటల లెక్కలు చెబుతు న్నారు. ఒక్కరూ నీ కడసారి చూపునకు రాలేదే? ఎందరో నిర్మాతలను నీ గొంతుతో బతికించావు.ఎందరో దర్శకులకు జీవితాన్నిచ్చావు. లెక్కలేనంత మంది హీరోలకు పేరు తెచ్చావు. ఒక్కడూ నిన్ను కడసారి చూసేందుకు రాలేదు. ఇలా చేసింది ఒక్క తెలుగు నటులే సుమా. ఇతర భాషల వారు నిన్ను మర్చి పోలేదు. నీతో అవసరం తీరిందని మొహం చాలేయలేదు. కన్నడ మీడియా ఏం చెప్పిందో తెలుసా బాలూ? మరో జన్మమంటూ ఉంటే బాలసుబ్రహ్మణ్యం మా గడ్డపై పుట్టాలని నినదించింది.తమిళ ప్రజలు ఏమన్నారో తెలుసా బాలూ? 'బాలసుబ్రహ్మణ్యం ది ప్రైడ్ ఆఫ్ తమిళనాడు' అన్నారు. అన్నట్లు సమైక్య ఆంధ్రాలోగానీ రెండుగా విడిపోయిన తర్వాత కానీ రెండు తెలుగు రాష్ట్రాలూ నీకు పెదవి చివరి పొగడ్త తప్ప మరేమీ అందివ్వలేదు.నీకు పద్మా అవార్డుకు తమిళనాడు ప్రభుత్వం సిఫార్సు చేసింది. తెలుగుకు పట్టిన ఈ తెగులును వదిలించడానికి నీవు ఎంతో శ్రమ పడ్డావు. 'ళ' అక్షరానికి 'ల' అక్షరానికి తేడా కూడా తెలియ కుండా మాట్లాడే వారికి వివేచన కల్పించావు.మరి ఈ తెలుగు హీరోలకు, నాయకులుకు బుద్ధి వచ్చే పని ఒక్కటైనా చేశావా? చేయలేదు. అందుకే ఈ తెగులు నేతలకు, తెగులు హీరోలకు నీవంటే అంత చులకన.అన్నట్టు మరచ్చిపోయాను బాలూ, ఈ తెగులు హీరోల నుంచి ఇలాంటి అనుభవం పొందిన వాడిని నీవే అనుకుంటున్నావా? కాదు సుమా, నీకన్నా పెద్దవాడు, మధుర గాయకుడు ఘంటసాల మాస్టారికి కూడా ఇదే అనుభవం ఉంది.ఘంటసాల మాస్టారు నీలానే కన్ను మూసినప్పుడు ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు వెళ్లలేదు. ఎన్టీరామారావు 'తాతమ్మకల' సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నాడట.అక్కినేని నాగేశ్వరరావు ' ఘంటసాలను ఆ పరిస్థితుల్లో చూడలేను. అందుకే వెళ్లను' అని స్టేట్ మెంట్ ఇచ్చేశారట. నీకు తెలుసు కదా బాలూ, ఘంటసాల మాస్టారు లేనిదే ఈ ఇద్దరూ లేరు.అయినా సరే వారు ఘంటసాల మాస్టారి కడసారి చూపునకు వెళ్లలేదు. అందుకే నీవు మనసులో ఏమీ పెట్టుకోవద్దు బాలూ. ఈ జీరోలు వచ్చినా రాకపోయినా నీవు మా వాడివి.నీవు మా గుండెల్లో ఉంటావు. నీ విషయంలోనే కాదు ఘంటసాల మాస్టారి కడసారి చూపు కోసం వేలాది మంది తరలి వచ్చారు. అచ్చు నీకు జరిగినట్లుగానే సాంప్రదాయ బద్ధంగా మాస్టారి అంత్యక్రియలు జరిగాయి.మీ రిద్దరూ ఇప్పుడు ఇంద్ర సభలో కలిసినప్పుడు ఈ విషయాలు మాట్లాడుకోవద్దు. ఈ తుచ్ఛ మానవులను క్షమించండి... అందులోనూ తెలుగు హీరోలను క్షమించండి. అంటూ ఫార్వర్డ్ అవుతోంది.

# వ్యవసాయ మీటర్లతో ఇబ్బందేమీ లేదు

## లోడ్ కెపాసిటీ తెలుసుకునేందుకే బిగింపు

## నాణ్యమైన విద్యుత్ అందించాలన్నదే లక్ష్యం

## వైఎస్సార్ జలకళ ప్రారంభోత్సవంలో సిఎం జగన్

అమరావతి,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): మీటర్లు బిగించడం ద్వారా రైతులకు ఏ ఇబ్బంది ఉండదని సిఎం జగన్ ఉద్ఘాటించారు. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా లోడ్ తెలుసుకునేందుకే మీటర్ల ఏర్పాటని అన్నారు. మీటర్ల ఏర్పాటుతో కరెంట్ ఎంత ఓల్టేజ్‌తో సరఫరా అవుతుందో తెలుసు కోవచ్చన్నారు. లో ఓల్టేజ్ ఉన్న చోట ఫీడర్ కెపాసిటీ పెంచి నాణ్యమైన విద్యుత్ ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ బిల్లులకు సంబంధించిన డబ్బులు రైతుల అకౌంట్‌లో వేస్తాం. రైతులే నేరుగా విద్యుత్ బిల్లులు చెల్లిస్తారు. విద్యుత్ సరఫరాలో లోపాలుంటే రైతుకు ప్రశ్నించే హక్కు ఉంటుంది. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని జగన్ పునరుద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం వైఎస్ఆర్ జలకళ' పథకానికి శ్రీకారం చుట్టారు. మెట్టభూములకు సాగు నీరు అందించేందుకు ఉచిత బోర్ల పథకం వైఎస్సార్ జలకళ పథకాన్ని ముఖ్యమంత్రి సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 3లక్షల మంది రైతులకు ఉచితంగా వ్యవసాయ బోర్లు వేయనున్నారు. 'వైఎస్ఆర్ జలకళ' కోసం ప్రభుత్వం రూ.2,340 కోట్లు ఖర్చుచేయబోతుంది. 5 లక్షల ఎకరాలకు ఉచిత బోర్ల ద్వారా సాగునీరు అందించనుంది. బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతుల కష్టాలను పాదయాత్రలో స్వయంగా చూసిన జగన్ వారికి అండగా నిలుస్తానని అప్పట్లో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. నవరత్నాల్లో భాగమైన ఆ హామీని నెరవేర్చారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు కోసం మరో అడుగు ముందుకు వేశామన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో అర్హులైన రైతులందరికీ ఉచిత బోర్ల ద్వారా వారి మెట్ట భూములకు సాగు నీరు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ జలకళ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. శాస్త్రీయంగా భూగర్భ జల సర్వే అనంతరం బోరు వేసే ప్రాంతాన్ని గుర్తిస్తారని తెలిపారు. రాష్ట్రంలోని రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. పారదర్శకత కోసం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకోస్తామన్నారు. దరఖాస్తు నుంచి బోర్ డ్రిల్లింగ్ వరకు ఎప్పటికప్పుడు రైతుకు సమాచారం అందుబాటులో ఉండే విధంగా దీనిని రూపొందిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం జగన్ మాట్లాడుతూ.. 'వైఎస్ఆర్ జలకళ' కోసం రూ.2,340 కోట్లు ఖర్చు చేయబోతున్నాం. చిన్న, సన్నకారు రైతులకు బోర్లు వేయించడంతో పాటు మోటార్లు బిగిస్తాం. మోటార్ల కోసం మరో రూ.1600 కోట్లు ఖర్చు పెడుతున్నాం. వాలంటీర్ల సహకారంతో గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. బోర్ ఎక్కడ వేస్తే నీళ్లు పడతాయన్న సర్వే కూడా చేస్తాం. బోర్ వేసేందుకు, సర్వే ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. ఇప్పటికే రైతులు వేసుకున్న బోర్లు ఫెయిలైతే.. మళ్లీ వేయిస్తాం. యూనిట్‌కు 6.80 పైసలు చొప్పున నెలకు రూ.9,272 విద్యుత్ బిల్లును భరిస్తాం. గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.8,655 కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వంలో పగటిపూట విద్యుత్ ఇవ్వాలనే ఆలోచన రాలేదు. గత ప్రభుత్వం హయాంలో ఫీడర్ల కెపాసిటీ 59 శాతం మాత్రమే ఉండేది. రూ.1700 కోట్లు ఖర్చు చేసి ఫీడర్ల కెపాసిటీని 89శాతానికి తీసుకొచ్చామని అన్నారు. 10వేల మెగావాట్ల సోలార్ పవర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నాం. సోలార్ ఉత్పత్తి ద్వారా యూనిట్ రూ.2.30కే అందుబాటులోకి వస్తుంది. రైతులపై విద్యుత్ భారం మోపుతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దుష్ప్రచారం చేస్తున్న వారిని రైతులే నిలదీస్తారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో జనతాబజార్ తీసుకొస్తాం.'అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, కన్నబాబు, అనిల్ కుమార్ యాదవ్, గుమ్మనూరు జయరామ్, సీదిరి అప్పలరాజు, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ హాజరైయ్యారు.

గ్రామ వలంటీర్ల ద్వారా గ్రామ సచివాలయాల్లో రైతులు సమర్పించిన దరఖాస్తులను తొలుత వీఆర్వో పరిశీలిస్తారు. అక్కడి నుంచి డ్వామా ఏపీడీకి వెళ్తాయి. ఆ దరఖాస్తులను ఆయన భూగర్భ జలాల సర్వే కోసం జియాలజిస్టుకు పంపుతారు. అక్కడి నుంచి అనుమతి రాగానే డ్వామా ఏపీడీ ఆ దరఖాస్తుకు పరిపాలనా అనుమతి ఇస్తారు. అనుమతి అనంతరం కాంట్రాక్టర్ బోరుబావులను తవ్వుతారు. ఒకసారి బోర్‌వెల్ విఫలమైతే మరోసారి కూడా బోర్ వేస్తారు. ఈ పథకం కింద వేసే అన్ని బోర్లకు సామాజిక ఆడిట్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం సమర్థవంతంగా పర్యవేక్షణకు, అమలుకు రాష్ట్ర స్థాయిలో పీఎంయూ ఏర్పాటు చేస్తారు. బోర్ వేయడం పూర్తయిన తరువాత కాంట్రాక్టర్‌తో పాటు లబ్దిదారుడి సమక్షంలో జియో ట్యాగింగ్‌తో కూడిన డిజిటల్ ఫొటో తీస్తారు.



తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రారంభించిన సిఎం వైఎస్ జగన్. చిత్రంలో మంత్రులు కన్నబాబు, పెద్దిరెడ్డి, బొత్సలు ఉన్నారు.

# కర్నాటకలో ఘోరరోడ్డు ప్రమాదం

## -ఏడుగురు అక్కడిక్కడే మృతి

బెంగళూరు,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): కర్ణాటకలో ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఆపి ఉన్న ట్రక్కును కారు ఢీకొన్న ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున కలబురగి జిల్లాలోని సవలగి గ్రామ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆపి ఉన్న ట్రక్కును వేగంగా దూసుకొచ్చిన కారు ఢీ కొట్టడంతో గర్భిణీ స్త్రీ సహా ఏడుగురు మరణించారు. మృతి చెందిన వారిని.. ఇర్ఫాన్ బేగం (25), రూబియా బేగం (50), అబెదాబీ బేగం (50), జయజునాబీ (60), మునీర్ (28), మహ్మద్ అలీ (28), షౌకత్ అలీ (29)గా పోలీసులు గుర్తించారు. కాగా వీరందరూ అలండ్ తాలుకాలోని ఒకే గ్రామానికి చెందినవారు. అందులోబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. గర్భిణిని ఆస్పత్రిలో చేర్పించడానికి వీరంతా కలబురగికి వస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనపై కలబురగి జిల్లా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# గూడు కల్పించడమే లక్ష్యంగా డబుల్ ఇళ్లు

## -పేదలందరికి ఇళ్లు కట్టిస్తామన్న మంత్రి పువ్వాడ

ఖమ్మం,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): నిరుపేదలకు అవసరమైన ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వంమే ఉచితంగా నిర్మించి అందజేస్తుందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. పేదలకు గూడు కల్పించి వారు ఆత్మగౌరవంతో బతకాలని సిఎం కెసిఆర్ డబుల్ ఇళ్ల పథకం ప్రవేశ పెట్టారని అన్నారు. జిల్లాలోని కారేపల్లి మండలం గాంధీనగరంలో డబల్ బెబ్ రూం ఇండ్లను ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రతి గ్రామంలో ఇండ్లు లేని వారిని గుర్తించి వారికి ఆసరా కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు. మరికొందరికి కూడా త్వరలోనే ఇండ్లు ఇచ్చేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించి ప్రభుత్వం అమలు చేయనున్నట్లు తెలిపారు. రానున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకమైనవని మంత్రి అన్నారు. పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని సూచించారు. ప్రతి కార్యకర్తా తన చుట్టుపక్కల పట్టభద్రులను గుర్తించి ఓటు నమోదు బాధ్యతలను తీసుకోవాలని సూచించారు. 2017కు ముందు డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరినీ కలిసి వారి వద్ద నుంచి సర్టిఫికెట్లను జిరాక్సులు తీసుకొని వారికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఎన్నికల రోజున వారితో ఓటు వేయించే బాధ్యతలను కూడా కార్యకర్తలే తీసుకోవాలన్నారు. మన తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అడగాలని అన్నారు. ఓటు అడిగే హక్కు టీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు.త్వరలో జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ సత్తా చాటాలని అన్నారు. కార్యక్రమంలో మండల టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమంలో మనమే ముందున్నాం

## పేదలకు వరంగా మారిన కళ్యాణలక్ష్మి

## రెవెన్యూ చట్టంతో గ్రామాల్లో భూ సమస్యలకు చెక్

## చెక్కుల పంపిణీలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

వరంగల్ రూరల్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): సంక్షేమంలో మన రాష్ట్రమే ముందుందని, దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలోనే అమలవుతున్నాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పేదల సంక్షేమం లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌దన్నారు. రాయపర్తి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. పాలకుర్తి నియోజకవర్గంలో గల రాయపర్తి మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన 43 మందికి 43లక్షల, 4వేల 988 రూపాయల విలువైన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి లబ్దిదారులకు పంపిణీ చేశారు. సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు మన రాష్ట్రంలోనే అమలు అవుతున్నాయన్నారు. కరోనా కష్ట కాలంలోనూ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న ఘతన మన సీఎం కెసిఆర్ దే అన్నారు. కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు ఇస్తూ, సీఎం కెసిఆర్, ప్రతి పేదింటి పెద్దన్నయ్య అయ్యారని కొనియాడారు. దేశం గర్వించేలా అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు మన రాష్ట్రంలోనే అమలు అవుతున్నాయని తెలిపారు. కరోనా కష్ట కాలంలోనూ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న ఘతన మన సీఎం కేసీఆర్ దే అన్నారు. కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలతో సీఎం కేసీఆర్ ప్రతి పేదింటికి పెద్దన్నగా మారాడని కొనియాడారు. ఇక రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం చేస్తున్న కృషి వెలకట్టలేనిదన్నారు. నూతన రెవెన్యూ చట్టంతో రైతుల కష్టాలు తీరినట్లేనని పేర్కొన్నారు. అలాగే వర్షాలకు ఇండ్లు కోల్పోయిన బాధితులకు పరిహారాన్ని మంత్రి ఈ సందర్భంగా అందజేశారు. రైతుని రాజుని చేయడంలో సిఎం కెసిఆర్ చూపిస్తున్న తెగువ, చొరవ ముందు ఎవరైనా దిగదుడిపేనన్నారు. ఒకవైపు వ్యవసాయాన్ని మన రాష్ట్రంలో సీఎం కెసిఆర్ పండుగ చేస్తుంటే, దేశంలో దండుగ చేసే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. రైతుల భూములను కొత్త రెవిన్యూ చట్టం ద్వారా మన సీఎం కెసిఆర్ కాపాడాలని చూస్తుంటే, అవే రైతుల భూములను కార్పొరేట్లకు అప్పగించే పనికి కేంద్రం పూనుకున్నదన్నారు. ఇటు రెవిన్యూ, అటు కేంద్ర వ్యవసాయ చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మంత్రి సూచించారు. ఇక ప్రతి మనిషి పుట్టుకకు ముందు నుంచి మరణానంతరం వరకు అనేక ప్రభుత్వ సేవలు ఉచితంగా అందేలా సీఎం కెసిఆర్ అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి వివరించారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు బాగుపడాలన్నదే సీఎం కెసిఆర్ లక్ష్యమన్నారు. కాగా ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు ఇండ్లు దెబ్బతిన్న, కూలి పోయి న బాధితులకు పరిహారాలను మంత్రి ఈ సందర్భంగా పంపిణీ చేశారు.

# సోమశిలకు కొనసాగుతున్న వరద

## -నిండుకుండలా మారిన జలాశయం

నెల్లూరు,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. 74 టీఎంసీల నీటి నిల్వతో సోమశిల నిండుకుండలా మారింది. దాదాపు లక్షా 20 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో, లక్షా 20 వేల క్యూసెక్కుల అవుట్ ఫ్లో కొనసాగుతోంది. జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలుగా ఉంది. దీంతో అధికారులు జలాశయం 10 గేట్ల నుంచి పెన్నా నది ద్వారా సముద్రానికి నీటిని విడుదల చేశారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెన్నా పరివాహక లోతట్టు ప్రాంతాల జనాన్ని అప్రమత్తం చేయాలని ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులు, గ్రామ వలంటీర్లను తహసీల్దారు షఫీమాలిక్ హెచ్చరించారు. సోమశిల జలాశయం నుంచి దిగువ పెన్నానదికి వరద ప్రవాహం వస్తుందని చెప్పారు. జొన్నవాడ, శ్రీరంగరాజపురం, దామరమడుగు గ్రామాల లోతట్టు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఇదిలావుంటే పెన్నమ్మ ఉగ్రరూపం దాల్చి సోమశిల జలాశయానికి వరద పోటెత్తుతోంది. ఇన్‌ఫ్లో గంట గంటకూ హెచ్చుతగ్గులు ఉండటంతో ఏక్షణాన ఏం జరుగుతుందోనన్న ఆందోళన రేగుతోంది. ఈ పరిస్థితుల్లో జలాశయం దగ్గరుండి పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. జలాశయ భద్రతా దృష్ట్యా నిల్వ సామర్థ్యం 75 టీఎంసీలకు కుదించారు.

సోమశిల నుంచి భారీగా నీరు దిగువకు విడుదల చేయడంతో జలాశయం ముందు ప్రొటెక్షన్ వాల్‌కు సమీపంలో ఎడమ వైపు నిర్మించి ఉన్న పొర్లుకట్ట రివిట్‌మెంట్ సుమారు 150 మీటర్లు కోతకు గురైంది. జలాశయం నుంచి 2 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే ఈ ప్రాంతంలో కట్టకు ప్రమాదం తప్పదు.

కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కురిసిన వర్షాలకు కుందూ, పాపాగ్ని, సగిలేరు, చిత్రావతి నదుల నుంచి వస్తున వరద పెన్నాలో కలవడంతో సోమశిలకు భారీగా వరద వస్తోంది. సోమశిల నుంచి నెల్లూరు వరకు పెన్నాతీరం వెంబడి చాలా గ్రామాల్లో పొర్లు కట్టలు ధ్వంసం చేసి కొందరు పొలాలుగా మార్చారు. దీంతో దిగువ పరివాహక ప్రాంతాలలోని గ్రామాలకు ముప్పు పొంచి వుంది. వరద భయంతో ప్రజలు వణికిపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

# అలిపిరి కాలి మార్గానికి ఆధునీకరణ

తిరుపతి,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): రిలయన్స్ సౌజన్యంతో చేపట్టనున్న అలిపిరి కాలినడక మార్గం ఆధునికీకరణ పనులకు సోమవారం ఉదయం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, రిలయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. రూ.25 కోట్లతో కాలినడక మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు రిలయన్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఆరు నెలల్లో పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

# వృధాగా సముద్రంలోకి గోదావరి నీరు

## బాబ్లీ గేట్లు మూయడంతో వృధాను అరికట్టే యత్నం
## మహారాష్ట్ర ప్రతిపాదనలపై ఇంజనీర్ల చర్చ?

నిజామాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): గోదావరిలో వరదనీటి వృధాను అరికట్టేందుకు బాబ్లీ గేట్లను ముందే మూసేసే ప్రతిపాదనపై అధికారుల స్థాయిలో చర్చలు సాగుతున్నాయని తెలుస్తోంది. సముద్రంలోకి వృధాగా నీరు ఓయే బదులు అరికట్టేందుకు చర్చిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఎగువ భాగాన మహారాష్ట్రలో ఉన్న బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను గడువు కన్నా ముందే దించడం ద్వారా వృధాను అరికట్టవచ్చని మహారాష్ట్ర సర్కారు సూచిస్తోంది. మహారాష్ట్ర ఇంజనీర్లు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఇంజనీర్ల ముందు ఇప్పటికే దీనిపై ప్రతిపాదన చేశారని సమాచారం. బాబ్లీ గేట్లను మూసేయడానికి ఇంకా నెల గడువు ఉన్నప్పటికీ ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అధికారికంగా వెలువడాల్సి ఉంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఏటా జూలై 1న బాబ్లీ ప్రాజెక్టులో 14 గేట్లు ఎత్తి, అక్టోబర్ 28 వరకు తెరిచి ఉంచాలి. అక్టోబర్ 29న మూసివేయాలి. ప్రతిఏటా ఇదే రీతిన కేంద్ర జల సంఘం అధికారుల సమక్షంలో గేట్లు తెరవడం, మూయడం జరుగుతోంది. ఈ ఏడాది జూలై ఒకటిన గేట్లు తెరిచిన అనంతరం ఇప్పటివరకు ఎస్సారెస్పీలోకి ఏకంగా 225 టీఎంసీల మేర కొత్తనీరు వచ్చి చేరింది. ఆదివారం సైతం ప్రాజెక్టులోకి 96 వేల క్యూసెక్కుల మేర వరదనీరు వస్తుండగా, ప్రాజెక్టు నుంచి లక్ష క్యూసెక్కుల మేర నీటిని దిగువకు వదిలేస్తున్నారు. ఈ వరదంతా బాబ్లీని దాటుకుంటూ వస్తోంది. బాబ్లీని దాటుకుంటూ వరదంతా దిగువకు వెళుతుండటం, గోదావరి నదిపై ఉన్న తెలంగాణ రిజర్వాయర్లు ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, లోయర్ మానేరులన్నీ నిండుగా ఉండటంతో బాబ్లీ గేట్ల మూసివేత ప్రతిపాదనను మహారాష్ట్ర ముందుకు తెచ్చింది. గేట్లు మూస్తే బాబ్లీలో 2.74 టీఎంసీల నిల్వ సాధ్యమవుతుంది. దీనివల్ల బాబ్లీపై ఆధారపడి చేపట్టిన ఒకట్రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని మళ్లించుకోవాలని భావిస్తోంది. అయితే దీనిపై తెలంగాణ ఎలాంటి అభిప్రాయమూ చెప్పలేదు. మహారాష్ట్రలోని గైక్వాడ్ నుంచి ఎస్సారెస్పీ వరకు ఉన్న చిన్న, చిన్న రిజర్వాయర్‌లు, చెక్‌డ్యామ్‌లు నిండుగానే ఉన్నాయి. నాందేడ్ వంటి ఎత్తిపోతల పథకాలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి. గైక్వాడ్ ప్రాజెక్టులోనూ 102 టీఎంసీలకుగానూ 101 టీఎంసీల మేర నిల్వలు ఉండగా 53 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. ఈ వరద అక్టోబర్ వరకూ కొనసాగే అవకాశాలున్నాయని స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ మహారాష్ట్ర ముందుగానే గేట్లు మూసే ప్రతిపాదన చేయడం గమనార్హం. గతంలో ఒకసారి అక్టోబర్‌లో గేట్లు మూశాక, బాబ్లీ నిండి మరింత వరద కొనసాగుతున్న తరుణంలో మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలేసిన సందర్భాలున్నాయి. దానిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నిర్ణయించే అవకాశాలపై ఇరిగేషన్ శాఖలో అంతర్గత చర్చ జరుగుతోందని తెలుస్తోంది.

# వ్యవసాయబావులకు మీటర్లను అంగీకరించేది లేదు

## కేంద్రం తీరుపై బిజెపి నేతలను నిలదీయండి
## కొత్త రెవెన్యూ చట్టంతో రైతులకు ఎంతో మేలు
## దుబ్బాకలో పలు కార్యక్రమాలకు మంత్రి హరీష్ రావు శ్రీకారం

సిద్దిపేట,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): వ్యవసాయ బావులకు, బోర్లకు మీటర్లు బిగించాలన్న కేంద్ర నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. రైతులు కూడా కేంద్ర విధానాలను వ్యతిరేకించాలన్నారు. బిజెపి నేతలు వస్తే దీనిపై నిలదీయాలన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో మంత్రి హరీశ్ రావు సోమవారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ..చంద్రబాబు పాలనలో బాయిల కాడ బోర్లకు మీటర్లు పెడతానంటే.. రైతులంతా బాబుకు మీటర్లు పెట్టి వెనక్కి పంపారని, అదే విధంగా బీజేపీ ప్రభుత్వానికి దుబ్బాక ప్రజలు తగిన గుణపాఠం ఓటు రూపంలో చెప్పాలని కోరారు.

బాయిల కాడ మీటర్లు పెడితే.. 2,500 కోట్లు ఇస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆఫర్ ఇస్తే .. మీటర్లు వద్దు, 2,500 కోట్లు వద్దు.. మా తెలంగాణ రైతుల సంక్షేమమే మాకు ముద్దు అని సీఎం కేసీఆర్ తిరస్కరించినట్లు మంత్రి హరీశ్ రావు వెల్లడించారు. కరోనా దృష్ట్యా ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో కోత విధించాం. కానీ సంక్షేమ పథకాలు ఎక్కడా ఆపలేదు. తెలంగాణలో ముఖ్యమంత్రి తెచ్చిన నూతన రెవెన్యూ చట్టానికి రైతులు పాలాభిషేకం చేస్తే.. రైతుల నడ్డి విరిచే చట్టం తెచ్చిన కేంద్ర ప్రభుత్వం పై నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందంతో చేసుకుని నయా జమిందారి వ్యవస్థను తెచ్చింది ఎవరి ప్రయోజనాల కోసమో చెప్పాలని బీజేపీ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

ఈ సందర్భంగా దుబ్బాక మున్సిపాలిటీ 4వ వార్డు దుంపలపల్లి లో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న మురికి కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణాలు,5వ వార్డులో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న వార్డు ఆఫీస్ కార్యాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ప్రతి వీధిలో కలియ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆ తర్వాత చెల్లాపూర్‌లో మంత్రి పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. 16 కుల సంఘాలకు భవనాలు కావాలని ఆయా సంఘాలు కోరాయి. రెండు రోజుల్లో కోటి రూపాయలు మంజూరు చేయించి నిధులు పంపిస్తానని మంత్రి హామీనిచ్చారు. దుబ్బాక నియోజకవర్గంలో 3వేల ఇండ్ల నిర్మాణానికి కాలనీలు నిర్మించామని తెలిపారు. త్వరలోనే మీ జాగలో మీరే ఇండ్లు కట్టుకోవచ్చునని పేర్కొన్నారు. కరోనా నేపథ్యంలో కొంత ఆలస్యం అవుతున్నదని స్పష్టం చేశారు.

ప్రతి నియోజకవర్గ పరిధిలో వెయ్యి ఇండ్లు వారి సొంత స్థలంలో నిర్మించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు చెప్పారు. దుబ్బాకకు వెయ్యితో పాటు అదనంగా వెయ్యి ఇండ్ల నిర్మాణాలు చేసుకునేలా సీఎం కేసీఆర్ అనుమతి తీసుకుందామన్నారు.



దుబ్బాకలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మంత్రి హరీష్ రావు

# పట్టభద్ర ఓటరుగా నమోదు కావాలి

## -సన్నాహక సమావేశంలో ఎంపి రంజిత్ రెడ్డి

రంగారెడ్డి,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): అక్టోబర్ 1వ తేదీన నుంచి ప్రతి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్‌గా అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి సూచించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశం సోమవారం చేవెళ్ల నియోజకవర్గంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి రంజిత్ రెడ్డి మాట్లడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్స్ విషయంలో మంత్రి కేటీఆర్ ఓటరు నమోదు విషయమై దిశా నిర్దేశం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో భాగంగా 2017 కంటే ముందు డిగ్రీ పూర్తి చేసుకున్న గ్రాడ్యుయేట్స్ లిస్ట్ తయారు చేసుకొని వారందరినీ ఓటరు గా నమోదు చేయించాలన్నారు. ఓటు నమోదు చేసుకున్న గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో వారి ఓటు హక్కు వినియోగించుకునేలా మోటివేట్ చేయాల్సిన బాధ్యత పార్టీ ఇంచార్జ్‌ల మీద ఉందన్నారు. టీఆర్ఎస్ కు రాష్ట్ర వ్యాప్తంగా బలమైన క్యాడర్ ఉన్నందున ప్రతి కార్యకర్త ఒక వంద మంది గ్రాడ్యుయేట్స్ ని ఎన్ రోల్ చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనటు వంటి అభివృద్ధి పథకాలు తెలంగాణ లో అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. వీటి ప్రాముఖ్యత, ఉపయోగాలను గ్రాడ్యుయేట్స్ కి వివరించాలన్నారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ తప్పకుండా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ,ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి నియోజకవర్గంలోని వివిధ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మావోయిస్టుల బంద్ పిలుపు

## అప్రమత్తం అయిన పోలీసులు

భూపాలపల్లి,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): మావోయిస్టుల బంద్ పిలుపు నేపథ్యంలో పోలీసులు అప్రమత్త మయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అటవీ, మారుమూల ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పెద్దఎత్తున కూంబింగ్ చేపట్టారు. గోదావరి పరివాహక, మారుమూల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. పలిమెల, మహాముత్తారం, మహదేవపూర్ మండలాలతో పాటు కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలు పెరగడంతో పోలీసులు కూబింగ్‌ను ముమ్మరం చేశారు. ఈక్రమంలో ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సెప్టెంబర్ రెండోవారంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఇందులో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఎన్‌కౌంటర్లకు నిరసనగా మావోయిస్టుల నేడు రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చారు. బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. పలిమెల, మహముత్తారం, మహదేవపూర్ మండలాలతో పాటు కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు.

# నటుడు జయరాజ్ జయంతి వేడుకలు..



వేములవాడ, సెప్టెంబర్ 28 (నేటినిజం ప్రతినిధి):కరీంనగర్ జిల్లా మున్నూరు కాపు ముద్దుబిడ్డ ప్రముఖ బాలీవుడ్ సినీ నటుడు జయరాజ్ జయంతి వేడుకలు వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా వేములవాడ పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బింగి శ్రీనివాస్ మాట్లాడుతూ బాలీవుడ్ సినిమా ఇండస్ట్రీలో తెలుగు నటుడు తనదైన శైలిలో సినిమాలో నటించి బాబాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత గా పేరు సంపాదించుకున్న నటుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యులు వారాల దేవయ్య, సోమినేని మహేష్, కోయినేని బాలయ్య, తొగరి కరుణాకర్, ఉప్పుల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# పులిచింతల బాధితుల ఆందోళన

సూర్యాపేట,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): జిల్లాలోని చింతలపాలెం మండలం పులిచింతల ప్రాజెక్టు బ్రిడ్జి వద్ద వజినేపల్లి, బుగ్గమాధారం గ్రామస్తులు ఆందోళనకు దిగారు. పులిచింతల ప్రాజెక్ట్ గేట్ల నుంచి విడుదలైన నీటితో వందల ఎకరాల్లో పత్తి, వరి పంటలు మునగాయి. ప్రతి ఏటా నష్టపోతున్నా పట్టించుకోవడం లేదని, నష్టపరిహారం కల్పించాలని రైతులు ఆందోళనకు దిగారు. వజినేపల్లి, బుగ్గమాధారం గ్రామాలను ముంపు పరిధిలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# విద్యుత్ బిల్లుతో ఉచిత విద్యుత్‌కు మంగళం

## వ్యవసాయ బిల్లుతో రైతులకు తీరని మోసం: చాడ

సిద్దిపేట,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ రంగ సంస్థలు జెన్ కో, ట్రాన్స్ కో వంటి వాటిని ప్రైవేట్ పరం చేసే కేంద్రం కుట్రలో భాగమే కేంద్రం తీసుకువచ్చిన విద్యుత్ బిల్లు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ బిల్లుతో మీటర్లు బిగించి ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే పన్నాగం పాడుతున్నారని అన్నారు. రాష్ట్రాలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేలా కేంద్ర ప్రభుత్వ వైఖరి ఉందన్నారు. స్వేచ్ఛా మార్కెట్ వల్ల చిన్న, సన్నకారు రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతుల మెడలకు ఉరితాడు బిగించేందుకే కేంద్రం ఈ బిల్లులు తెచ్చిందని చాడ వెంకటరెడ్డి విమర్శించారు. మోదీ మాటలు పచ్చి అబద్ధాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను తీసివేయాలి అని కేంద్రం ఆలోచనగా ఆయన పేర్కొన్నారు. త్వరలోనే సీపీఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ ఆందోళనలకు టీఆర్ఎస్ మద్దతు ఇస్తుందా.. లేదా? అనేది ఆ పార్టీ తేల్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఎల్ఆర్ఎస్ పేదలకు భారంగా మారిందన్నారు. అక్రమంగా భూములు కబ్జాలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చాడా వెంకటరెడ్డి పేర్కొన్నారు. పేదలకు భారంగా మారిన ఎల్లారెస్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు.

# తానెప్పుడూ రైతు పక్షమే

## విపక్షాలది రాజకీయ బంద్ అన్న యెడ్యూరప్ప

బెంగళూరు,సెప్టెంబర్28 (ఆంఎన్ఎ): కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ బిల్లులను వ్యతిరేకిస్తూ కర్నాటక రాష్ట్ర వ్యాప్తంగా బంద్ నిర్వహించారు. రైతు సంఘాలు, కాంగ్రెస్, జేడీఎస్ ఈ బంద్‌కు మద్దతిచ్చాయి. అయితే ఈ బంద్‌ను 'రాజకీయ బంద్' గా సీఎం యడియూరప్ప అభివర్ణించారు. రైతులు తాము పండించిన పంటను దేశంలో ఎక్కడైనా అమ్ముకునే అవకాశం ఉందని తెలిపారు. మార్కెట్ కమిటీలకు తామేమీ మంగళం పాడలేదని, రైతులు పంటలను అక్కడ కూడా అమ్ముకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. లేదంటే రైతులకు ఎక్కడ అధిక ధర వస్తే అక్కడ అమ్ముకోవచ్చని తెలిపారు. గతంలో లేని అవకాశాన్ని హక్కును కల్పిస్తే ఎందుకు వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. రైతులందరూ ఓ ఆర్నెళ్ల పాటు వేచి చూడాలని, మోదీ తీసుకొచ్చిన కొత్త బిల్లులు వారికెలా ఉపయోగపడతాయో అప్పుడు తెలుస్తుందని ఆయన కోరారు. ఓ రైతు బిడ్డగా తాను రైతుల పక్షపాతినేనని, అందరితో సుదీర్ఘంగా సంప్రదించిన తర్వాతే కేంద్రం ఈ బిల్లులను తెచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ఈ బిల్లులపై సచివాలయంలో రైతు సంఘాలతో ఓ సమావేశం జరిగిందని, అప్పుడు సవరణపై చర్చించడానికి వారు ఏమాత్రం ఆసక్తిని చూపలేదన్నారు.

# వ్యవసాయ చట్టాన్ని వ్యతిరేకించే అర్హత కెసిఆర్‌కు లేదు

## బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

హైదరాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): పాలమూరు, రంగారెడ్డి ప్రాజక్టును కట్టలేని కేసీఆర్‌కు వ్యవసాయ చట్టాన్ని వ్యతిరేకించే హక్కు లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. బీజేపీ అంటే భయంతోనే కేసీఆర్ వ్యవసాయ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాడన్నారు. కేసీఆర్ మీద తెలంగాణ ప్రజలకు భ్రమలు తొలగిపోయాయన్నారు. దుబ్బాక, గ్రేటర్ ఎన్నికల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కలసి పనిచేయ బోతున్నాయని డీకే.అరుణ ఆరోపించారు. టిఆర్ఎస్‌తో కాంగ్రెస్ లోపాయకారి ఒప్పందాల ఉందన్న అనుమానాలు ఉన్నాయని అన్నారు. టీఆర్ఎస్‌కు ఓటు వేయమని కాంగ్రెస్ నేతలు ప్రచారం ప్రారంభించారన్నారు. గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందన్నారు. బీజేపీలో గ్రూప్‌లకు, వర్గాలకు తావు లేదన్నారు. తెలంగాణలో భవిష్యత్తు బీజేపీదేనన్నారు. బీజేపీ అధ్యక్ష పదవి రానందుకు నిరాశ చెందలేదని.. జాతీయ నాయకత్వం ఏ బాధ్యత ఇచ్చినా సమర్థవంతంగా నిర్వర్తిస్తానని డీకే అరుణ పేర్కొన్నారు. బిజెపిని అధికారంలోకి తీసుకుని రావడానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారంలో పాత్రికేయులు ముందుండాలి..

## -ఎంపీపీ బైరగోని లావణ్య



వేములవాడ, సెప్టెంబర్ 28 (నేటినిజం ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారంలో పాత్రికేయులు ముందుండాలని చందుర్తి ఎంపీపీ బైరగోని లావణ్య రమేష్ అన్నారు, చందుర్తి ప్రెస్ క్లబ్ కార్యవర్గం నూతనంగా ఎన్నికకాగా నూతన కమిటీని సోమవారం టిఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు, ఈ సందర్భంగా ఎంపిపి లావణ్య మాట్లాడుతూ గ్రామ స్థాయిలో జరిగే వివిధ రకాల ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందన్నారు, జర్నలిస్టులంతా ఐక్యంగా ఉంటూ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చెరవేయాలన్నారు, చందుర్తి మండల జర్నలిస్టుల సమస్యలను, ఇండ్ల స్థలాల విషయాలను ఎమ్మెల్యే రమేష్ బాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ తో పాటు కమిటీ సభ్యులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మరాటి మల్లిక్, సింగిల్విండో చైర్మన్ లు తిప్పని శ్రీనివాస్, జలగం కిషన్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల శ్రీనివాసరావు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కమలాకర్రావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మాదాసు వేణు, కో ఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ పాత్రికేయులు గడ్డం తిరుపతి రెడ్డి, గొట్టే మనోహర్, క్లబ్ ఉపాధ్యక్షులు ఏనుగుల కృష్ణ, లాండే ప్రసాద్, ప్రధాన కార్యదర్శిపొంచెట్టి మహేష్, కార్యదర్శులు రాజురి విష్ణు, నక్కయాకుబ్, ప్రచార కార్యదర్శి కటుకూరి ఎలియా, కోశాధికారి పత్తిపాక నాగరాజు, కార్యవర్గ సభ్యులు, శ్రావణ్,మోహినోదిన్, నవీన్, నిశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు,

# హత్య కేసులో నిందితుడి రిమాండ్

వేములవాడ, సెప్టెంబర్ 28 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో శనివారం రోజున ఓ వ్యక్తి దారుణంగా హత్యకు గురయ్యాడు. హత్య చేసిన వ్యక్తి ని పోలీసులు అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ సిఐ ఓ. వెంకటేష్ మీడియాతో మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలు గా పట్టణానికి చెందిన పూదరి శ్రీనివాస్ గౌడ్ (54) అనే వ్యక్తి కి అతని ఇంటి పక్కనే నివాసం ఉంటున్న కోరెపు రాజుకుమార్ అనే వ్యక్తి పాత కక్షలు ఉన్న నేపథ్యంలో శనివారం రోజున సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో గొడ్డలితో నరికి చంపినట్లు సిఐ తెలిపారు. సోమవారం రోజున అతడిని రిమాండ్ తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. క్షణికావేశంలో యువత హత్యలు చేయడం సరికాదని అన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ప్రజలకు ఏవైనా కుటుంబ సమస్యలు ఉంటే పోలీసులను ఆశ్రయించి పరిష్కారం చేసుకోవాలనీ తెలిపారు. క్షణికావేశంలో హత్యలు చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా హెచ్చరించారు. సిఐ వెంట ఎస్ ఐ, ఏఎస్ఐ శంకర్ నాయక్, రంగారావు, రాజశేఖర్ గౌడ్, రాజేందర్ లు ఉన్నారు.



# జర్నలిస్టులపై పెట్టిన తప్పుడు కేసులు వెంటనే ఎత్తివేయాలి

## -జర్నలిస్ట్ గౌతం బాబు పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

వేములవాడ, సెప్టెంబర్ 28 (నేటినిజం ప్రతినిధి):జర్నలిస్ట్ గౌతం బాబు పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా డిమాండ్ చేశారు. జర్నలిస్టుల పై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలి అన్నారు. దాడులు చేసిన వారే తిరిగి తప్పుడు కేసులు పెట్టడం ఉల్టా చోర్ కొత్వల్ కొ డాటా.. అన్నచందంగా ఈ వ్యవహారం ఉందన్నారు. సోమవారం లాయక్ పాష ఆధ్వర్యంలో జర్నలిస్టులు జిల్లా ఎస్పీ మరియు కలెక్టర్లకు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు.సమగ్ర విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ కరుణాల భద్రాచలం, అసారి మహేష్, పరకాల ప్రవీణ్, సయ్యద్ ఎస్మాత్, గొట్టే కిరణ్, అస్లాం ,రఫీ, గోవిందు వేణు, ఇట్టేడు గౌతమ్ బాబు, గడదాసు ప్రసాద్,సయ్యద్ అలీ, కములాకర్, కొప్పుల ప్రసాద్, గోగికారి సత్యం, నరేష్, దేవరాజ్, దూస రాజేందర్ , బండి శ్రీకాంత్, బండి రజనీకాంత్ , బూర్ల ప్రదీప్, బూర్ల సందీప్, షబ్బీర్, ఎబ్బేడి ప్రవీణ్, గంగాధర్ ,రాజశేఖర్, కటుకం శ్రీకాంత్, అబ్దుల్ జబ్బర్ లిక్కిడి రమేష్ ల తో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.



# కృష్ణా పరివాహక ప్రాంతాల్లో తగ్గని వరద

## కృష్ణా నదిలోకి కొనసాగుతున్న నీటిరాక
## నిండుకుండల్లా జలాశయాలు

హైదరాబాద్,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): పరీవాహక ప్రాంతంలో కుండపోత వర్షంతో కృష్ణమ్మ మహోగ్ర రూపం దాల్చింది.. ఆల్మట్టి, నారాయణపూర్‌ల నుంచి 63 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్‌కు దిగువన పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కృష్ణాలో వరద ఉధృతి పెరిగింది. జూరాల ప్రాజెక్టు నుంచి వస్తున్న 4.35 లక్షల క్యూసెక్కులకు సుంకేశుల బ్యారేజీ నుంచి విడుదల చేసిన 77 వేల క్యూసెక్కుల తుంగభద్ర నదీ జలాలు కలుస్తుండటంతో.. ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టులోకి 5,10,750 క్యూసెక్కులు చేరుతోంది. ఈ సీజన్‌లో శ్రీశైలం ప్రాజెక్టులోకి వచ్చిన గరిష్ట వరద ప్రవాహం ఇదే కావడం గమనార్హం. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటం, 884 అడుగుల నీటి నిల్వ ఉండటం తో.. పది గేట్లను 15 అడుగుల మేర ఎత్తేసి, కుడి గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక నాగార్జునసాగర్‌లోకి శ్రీశైలం నుంచి నీరు విడుదల కావడంతో 20 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి విడుదల చేస్తున్న జలాలకు మూసీ వరద తోడవ్వడంతో పులిచింతల ప్రాజెక్టులోకి వరద ఉధృతి మరింత పెరుగు తోంది. పులిచింతల ప్రాజెక్టులో 15 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి వదులుతున్న జలాలకు వైరా, మున్నేరు, కట్టలేరు, కొండవాగుల నుంచి వస్తున్న వరద తోడవ్వడంతో ప్రకాశం బ్యారేజీలోకి కృష్ణమ్మ ఉరకలెత్తుతోంది. బ్యారేజీలోకి వరద ప్రవాహం గంట గంటకూ పెరుగు తోంది. వచ్చిన వరదను వచ్చినట్టుగా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు వరద ఉధృతి అధికంగా ఉండటంతో అధికారులు 14 గేట్లు 4 మీటర్లు, 3 గేట్లు 5 మీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను... ప్రస్తుత నీటి నిల్వ 44.69 టీఎంసీలుగా ఉంది. అలాగే పూర్తి స్థాయి నీటి మట్టం 175.89 అడుగులు కాగా... ప్రస్తుత నీటి మట్టం 174. 309 అడుగులకు చేరింది. మూసీ ప్రాజెక్ట్‌కు వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో అధికారులు 3 గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 645 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 643.90 అడుగులకు చేరింది. అలాగే గోదావరిలో వరద ఉధృతి కొనసాగుతోంది. ఉపనది మంజీర నుంచి సింగూరులోకి నీరు చేరుతుండటంతో నీటి నిల్వ 23.18 టీఎంసీలకు చేరుకుంది. మరో 6 టీఎంసీలు చేరితే సింగూరు నిండుతుంది. నిజాంసాగర్‌లో నీటి నిల్వ 7.34 టీఎంసీలకు చేరుకుంది. నిజాంసాగర్ నిండాలంటే ఇంకా 10 టీఎంసీలు అవసరం. మానేరు ఉప్పొంగు తుండటంతో ఎగువ మానేరు, మధ్య మానేరు, దిగువ మానేరు డ్యామ్‌ల గేట్లను ఎత్తారు. ఎస్సారెస్పీలోకి వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టు ఇప్పటికే నిండిపోవడంతో గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీలోకి గోదావరి నది నుంచి గోదావరి డెల్టాకు 8 వేల క్యూసెక్కులు వదులుతూ మిగులుగా ఉన్న 3.87 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

సింగూరులో కొనసాగుతున్న ప్రవాహం

భారీ వర్షాల కారణంగా సింగూర్ ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం కొనసాగుతోంది. సింగూర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 23.456 టీఎంసీలుగా ఉంది. అలాగే ప్రాజెక్టు నీటి ఇన్ ఎ÷-లో 8140 క్యూసెక్కులుగా నమోదు అయ్యింది. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాల కోసం ప్రతీ రోజు 60 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటి ఆవిరి, లికేజ్ ద్వారా 60 క్యూసెక్కులు విడుదలవుతోంది. సింగూర్ ప్రాజెక్టులో మొత్తం నీటి ఔట్ ఫ్లో 120 క్యూసెక్కులుగా నమోదు అయ్యింది. సింగూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలుగా ఉంది. కరీంనగర్ జిల్లాలోని లోయర్ మానేరు డ్యామ్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దాదాపు 30 వేల క్యూసెక్కుల వరద నీటితో జలాశయం నిండుకుండలా మారింది. 24 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్న లోయర్ మానేర్ డ్యామ్‌లో ప్రస్తుతం 23.732 టీఎంసీల నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఈ క్రమంలో దాదాపు 15 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com